ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY
## స్టేట్ విజన్
STATE VISION
మంగళవారం 28-07-2026 పేజీలు : 16

# ఏసీబీ వలలో... అవినీతి అధికారి

**..రెండు వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జిపిఓ జగదీష్**



దోమ, జూలై 27(విజన్ ఆంధ్ర): కళ్యాణ లక్ష్మి ఫైలు ప్రాసెస్ చేయడానికి రెండు వేల రూపాయలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డ దోమ మండల పరిధిలోని మోత్కూరు గ్రామ పాలనాధికారి జగదీష్ . ఏసీబీ రంగారెడ్డి జిల్లా రేంజ్ డిఎస్పి ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మోత్కూరు గ్రామానికి చెందిన కళ్యాణ లక్ష్మి లబ్ది దారులు గ్రామ పాలన అధికారి జగదీష్ కు కళ్యాణ్ లక్ష్మి ఫైల్ ప్రాసెస్ చేసేందుకు అధికారిని సంప్రదించగా తనకు 6000 రూపాయలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు అంత మొత్తం ఇవ్వలేమని అడగగా రెండు వేల రూపాయలు ఇవ్వాలని లేకుంటే మీ ఫైలు ప్రాసెస్ కాదు అని తెలియజేయడంతో బాధితులు ఏసీబీ ని ఆశ్రయించారని తెలిపారు. సోమవారం నాడు ఏసీబీ అధికారుల ఆధ్వర్యంలో మోత్కూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో రెండు వేల రూపాయల లంచం తీసుకుంటుండగా అక్కడే మాటు వేసిన ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.




▶ ఆగష్టు 15 బంపర్ - రేవంత్ సర్కార్ నుంచి 2.5 లక్షల కొత్త పెన్షన్ల గిఫ్ట్



ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 27, (విజన్ ఆంధ్ర) : తెలంగాణలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న లక్షలాది మంది నిరీక్షణకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెరదించనుంది. రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంటూ ఆగష్టు 15, స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి 2.5 లక్షల కొత్త పెన్షన్ల పంపిణీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

సామాజిక భద్రతా పథకాలను మరింత విస్తరించే దిశగా అడుగు వేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా కొత్త పెన్షన్ల ఫైలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

5 పేజీలో...

# చదువుపైనే నమ్మకం

- ▶ ఆరుట్ల యువకుడు 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి రికార్డు
- ▶ గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి కష్టంతో క్లర్క్ నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ వరకు...
- ▶ రంగారెడ్డి జిల్లాకు గర్వకారణం..



మంచాల్,ఆరుట్ల,జూలై 26, (విజన్ ఆంధ్ర): “చదువును నమ్ముకున్న వాడు ఎప్పటికీ మోసపోడు” అనే మాటను అక్షరాలా నిజం చేసి చూపించాడు రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన చింద అంజన్ కుమార్... తండ్రి కృష్ణ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించినా చదువును మాత్రం వదలేదు అంజన్. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినా పట్టుదలను ఆయుధంగా మార్చుకున్నాడు.

14 పేజీలో...

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులు లబ్ధి పొందాలి

**- కలెక్టర్ కుమార్ దీపక్**

బెల్లంపల్లి, జూలై 27 విజన్ ఆంధ్ర : ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి లాభాలు పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం బెల్లంపల్లి మండలం గురజాల రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖతో కలిసి రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే మూడు నెలల్లోనూ



9 పేజీలో...

# కుత్బుల్లాపూర్‌కు రూ.270 కోట్ల రహదారి వరం

కొంపల్లి--బహదూర్‌పల్లి, గండి మైసమ్మ--మియాపూర్ రహదారుల పనులపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష

-రూ.270 కోట్లతో రెండు ప్రధాన రహదారి ప్రాజెక్టులకు వేగం

-అటవీ శాఖ అనుమతుల జాప్యం తొలగించి పనులు ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం

-పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం

-ప్రజలకు మెరుగైన రవాణా.. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

-రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



10 పేజీలో...

# ఇందిరమ్మ ఇళ్ల రీ-వెరిఫికేషన్ : పీడీకి వినతి

తానూర్ :జూలై 27:విజన్ ఆంధ్ర : నిర్మల్ జిల్లా: తానూర్ మండలంలోని ఝరి (బి) గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ మంజూరు విషయంలో అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గైక్వాడ్ సాయినాథ్ సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. గతంలో జరిగిన వెరిఫికేషన్ లో లోపాల వల్ల అర్హులకు ఇళ్లు మంజూరు కాలేదని ఆయన తెలిపారు.

తానూర్ మండలంలోని ఝరి (బి) గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ మంజూరు విషయంలో అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గైక్వాడ్ సాయినాథ్ సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా గైక్వాడ్ సాయినాథ్ మాట్లాడుతూ.. గతంలో స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో చేపట్టిన వెరిఫికేషన్ ప్రక్రియలో కొన్ని సాంకేతిక లోపాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. అర్హులైన పెంకుటిళ్లు, రేకుల ఇళ్లు ఉన్న లబ్ధిదారులకు సైతం ఆన్‌లైన్ రికార్డుల్లో 'ఆర్‌సీసీ బిల్డింగ్' (స్లాబ్ ఇల్లు) ఉన్నట్లు తప్పుగా నమోదు కావడంతో వారి ఇళ్ల ప్రొసీడింగ్స్ నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ విషయాన్ని జిల్లా పీడీ శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. దీనిపై పీడీ సానుకూలంగా స్పందించారని, రెండు మూడు రోజుల్లో స్పెషల్ ఆఫీసర్ తిరిగి ఝరి (బి) గ్రామానికి వచ్చి రీ-వెరిఫికేషన్ చేపడతారని చెప్పారు. ఆన్‌లైన్‌లో ఉన్న సమస్యలను సరిచేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని పీడీ హామీ ఇచ్చినట్లు గైక్వాడ్ సాయినాథ్ పేర్కొన్నారు.

# ఎలిగేన్స్ ప్రీమియర్ లీగ్ సీజన్ 2 విజేత పవర్ స్ట్రైకర్స్

బాలకృష్ణ సారథ్యంలో వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా పవర్ స్ట్రైకర్స్ ఘనవిజయం

లీగ్ నుంచి ఫైనల్ వరకు ఒక్క ఓటమి లేకుండా అద్భుత ప్రదర్శన

వికెట్ కీపింగ్‌లో నాగబాబు మెరుపులు... టోర్నీ బెస్ట్ కీపర్‌గా ప్రశంసలు

అత్యధిక పరుగులతో వినోద్, అత్యధిక వికెట్లతో దుర్గారావు సత్తా!

ఆల్‌రౌండర్ నరసింహ కీలక ప్రదర్శనతో జట్టు విజయాలకు బలమైన అండ

బండమైలారంలోని శ్రీ వాసుదేవ క్రికెట్ గ్రౌండ్‌లో ఘనంగా ముగిసిన ఎలిగేన్స్ ప్రీమియర్ లీగ్--2 వేడుకలు

కుత్బుల్లాపూర్, జూలై 27 (విజన్ ఆంధ్ర): బండమైలారంలోని శ్రీ వాసుదేవ క్రికెట్ గ్రౌండ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఎలిగేన్స్ ప్రీమియర్ లీగ్ (ఈపీఎల్) సీజన్--2 ఘనంగా ముగిసింది. శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో ఐదు జట్లు క్రీడాస్ఫూర్తితో పోటీపడి అభిమానులకు ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లను అందించాయి. చివరికి బాలకృష్ణ నాయకత్వంలోని పవర్ స్ట్రైకర్స్ జట్టు అద్భుత సమిష్టి ప్రదర్శనతో వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించింది. లీగ్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించిన పవర్ స్ట్రైకర్స్ జట్టు ఎనిమిది పాయింట్లతో పట్టికలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. అత్యుత్తమ నెట్ రన్‌రేట్ నమోదు చేసిన ఈ జట్టు అనంతరం జరిగిన నాకౌట్ దశలోనూ అదే జోరును కొనసాగించింది. సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌ల్లో ప్రత్యర్థులపై పూర్తి ఆధిపత్యం చెలాయించి టోర్నీ మొత్తం ఒక్క ఓటమి కూడా లేకుండా విజేతగా అవతరించింది. టోర్నీలో మన్నే స్ట్రైకర్స్--11 జట్టు రన్నరప్‌గా నిలవగా, ద ఎలైట్స్ ఆఫ్ ఎలిగేన్స్, ఫియర్‌లెస్ వారియర్స్ (ఎంపీటీ), రాక్ స్టార్స్ జట్లు కూడా పోటీతత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రతి మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చాయి. జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోటీ ప్రేక్షకులను చివరి బంతి వరకు ఉత్కంఠలో ముంచెత్తింది. పవర్ స్ట్రైకర్స్ విజయానికి ఆటగాళ్ల సమిష్టి కృషే ప్రధాన బలంగా నిలిచింది. ఆల్‌రౌండర్ నరసింహ బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కీలక ప్రదర్శన చేసి జట్టు విజయాల్లో ప్రధాన పాత్ర పోషించాడు. వినోద్ టోర్నీలో అత్యధిక పరుగులు సాధించి అత్యుత్తమ బ్యాట్స్‌మన్‌గా నిలవగా, దుర్గారావు అత్యధిక వికెట్లు పడగొట్టి బౌలింగ్ విభాగంలో తన సత్తాను చాటుకున్నాడు. ఇక వికెట్ల వెనుక నాగబాబు ప్రదర్శించిన చురుకుదనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెరుపువేగంతో చేసిన స్టంపింగ్స్, అద్భుత క్యాచ్‌లు, ఖచ్చితమైన వికెట్ కీపింగ్‌తో ప్రేక్షకులు, నిర్వాహకులు, సహచర ఆటగాళ్ల ప్రశంసలు అందుకున్న ఆయన టోర్నీ అత్యుత్తమ వికెట్ కీపర్ అవార్డును దక్కించుకున్నాడు. పవర్ స్ట్రైకర్స్ వరుస విజయాల్లో నాగబాబు పాత్ర విశేషమని క్రీడాభిమానులు కొనియాడారు. టోర్నీ మొత్తం యువ క్రికెటర్ల ప్రతిభ, జట్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ, క్రీడాస్ఫూర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి మ్యాచ్ చివరి బంతి వరకు ఉత్కంఠ రేకెత్తించడంతో అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ఉత్సాహపరిచారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ఇలాంటి టోర్నీలు కీలక పాత్ర పోషిస్తాయని పలువురు క్రీడాభిమానులు అభిప్రాయపడ్డారు. టోర్నీని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకుడు శ్రీనివాస్ యాదవ్తో పాటు కమిటీ సభ్యులను పాల్గొన్న జట్లు, క్రీడాకారులు, అభిమానులు అభినందించారు. భవిష్యత్తులో ఎలిగేన్స్ ప్రీమియర్ లీగ్ను మరింత ఉన్నత స్థాయిలో నిర్వహించి యువ క్రీడాకారులకు జాతీయ స్థాయి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

# హుస్నాబాద్ ఆర్డీవోకార్యాలయ ప్రజావాణికి ఎనిమిది దరఖాస్తులు

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 27 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి ఎనిమిది దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవిన్యూ విభాగానికి ఆరు కోహెడ ఎంపీడీవో ఒకటి ఆర్డీఓ కార్యాలయానికి ఒక దరఖాస్తు వచ్చాయన్నారు. ఇట్టి అర్జీలపై వెంటనే సంబంధిత విభాగాలకు పంపించి అర్జీదారులకు సమస్యలు పరిష్కరిస్తామన్నారు. దరఖాస్తులను ఆన్ లైన్ లో నమోదు చేసి ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతమైన సేవలు అందిస్తామని రెవిన్యూ అధికారులు తెలిపారు.

# గోంగ్లూర్ గ్రామ భూములపై ప్రజలకు హెచ్చరిక - హైకోర్టు ఉత్తర్వులు అమల్లో

చౌటకూర్ , జూలై 27: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని గోంగ్లూర్ గ్రామ పరిధిలోని పలు సర్వే నంబర్లలో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంబంధిత పట్టాదారులు హెచ్చరిక ప్రకటన విడుదల చేశారు. ప్రకటన ప్రకారం, సర్వే నంబర్లు 112, 115, 116, 117, 119, 120, 121, 122, 127, 140, 148, 151, 153, 154, 156, 157, 161, 163, 164, 172, 173, 174, 175, 178, 179, 182, 185, 186, 193, 195, 196, 795, 803 మరియు 691లకు సంబంధించిన స్థిరాస్తులపై వివాదం కొనసాగుతోంది. ఈ భూములకు సంబంధించి కొంతమంది వ్యక్తులు సదాబైనామాలు, నమోదుకాని అమ్మకపు దస్తావేజులను క్రమబద్ధీకరించాలని రెవెన్యూ అధికారులను ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. అయితే, ఆయా పత్రాల ప్రామాణికత, చెల్లుబాటు, చట్టబద్ధతను అసలు యజమానులు ప్రశ్నిస్తూ సంబంధిత అధికారుల ముందు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు డబ్ల్యూ.పీ. నెం. 14477/2026లో 2026 ఏప్రిల్ 29న ఇచ్చిన ఉత్తర్వుల మేరకు, సంబంధిత అధికారులు చట్టప్రకారం విచారణ నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని ఆదేశించినట్లు వెల్లడించారు. అంతిమ నిర్ణయం వెలువడే వరకు పై సర్వే నంబర్లలోని భూములను కొనుగోలు చేయడం, అమ్మకపు ఒప్పందాలు చేసుకోవడం, తనఖా, లీజు, అభివృద్ధి ఒప్పందాలు లేదా ఉమ్మడి అభివృద్ధి ఒప్పందాల్లో ప్రవేశించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు, పెట్టుబడిదారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు, డెవలపర్లకు సూచించారు. అంతేకాకుండా, ఈ భూములకు సంబంధించి ఎవరైనా లావాదేవీలు జరిపినా లేదా హక్కులు క్లెయిమ్ చేసినా, వాటి వల్ల కలిగే అన్ని చట్టపరమైన, ఆర్థిక పరమైన పరిణామాలకు వారే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిక ప్రకటనలో స్పష్టం చేశారు.

# గడి పెద్దాపూర్ వెళ్లే రోడ్డుకి భూమి పూజ

## - వట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి

అందోల్ జూలై 27 (విజన్ ఆంధ్ర ప్రతినిధి ) బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి రాష్ట్ర వైద్య ఆరోగ్య సైన్స్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదేశానుసారం సోమవారం మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలోని గడి పెద్దాపూర్ గ్రామానికి 161వ జాతీయ రహదారి నుండి గడి పెద్దాపూర్ వెళ్లే రోడ్డుకి భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి,ఏఈ రమేష్ , సర్పంచ్ హరికృష్ణ , డిసిసి జిల్లా ఉపాధ్యక్షుడు సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి , డి సి సి మెదక్ జిల్లా కార్యదర్శి బాలకిషన్ , ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బసన్న గారి బలరాం, మాజీ ఎంపీటీసీ విఠల్ రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు అబ్దుల్ సుకూర్, అభిలాష్ రెడ్డి , ఉప సర్పంచ్ శ్రీశైలం , శేఖర్ పటేల్, సురేష్ గుప్త , ఆంజనేయులు, సాయిబాబా, విశ్వేశ్వర్, మల్లికార్జున్, రాజా గౌడ్, విఠల్ , నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జవుల (బి)లో సీసీ డ్రైన్ పనులకు అక్రమ నిర్మాణం అడ్డు: గ్రామస్తుల ఆందోళన

తానూర్ :జూలై 27:విజన్ ఆంధ్ర : తానూర్ మండలంలోని జవుల (బి) గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు ఓ అక్రమ నిర్మాణం అడ్డుగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు పనులు ప్రారంభించగా, అక్రమ నిర్మాణం వల్ల పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ నిర్మాణాన్ని తొలగించి పనులు కొనసాగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలోని జవుల (బి) గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు ఓ అక్రమ నిర్మాణం అడ్డంకిగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారులు సీసీ డ్రైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టగా, ఈ అక్రమ నిర్మాణం వల్ల పనులు ముందుకు సాగడం లేదని తెలిపారు.

సంబంధిత నిర్మాణాన్ని తక్షణమే తొలగించి, డ్రైన్ పనులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యపై అధికారులు తగిన చర్యలు తీసుకుని, అభివృద్ధి పనులకు ఆటంకం లేకుండా చూడాలని వార్డు సభ్యుడు కోరారు. సమస్యను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



గ్రామంలో ప్రజల అవసరాల కోసం చేపడుతున్న అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా సంబంధిత అధికారులు పరిశీలించి, సత్వరమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

## మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి

అక్కన్నపేట, జూలై 27 విజన్ ఆంధ్ర : మాజీ రాష్ట్రపతి, భారతరత్న డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సామాజిక కార్యకర్త, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబం నుంచి దేశ అత్యున్నత రాష్ట్రపతి పదవిని అధిరోహించిన డా. ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని అన్నారు. నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, దేశభక్తి విలువలతో ఆయన సాగించిన జీవన ప్రస్థానం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. దేశ అభివృద్ధి కోసం కలాం చేసిన సేవలు చిరస్మరణీయమని, విజ్ఞానశాస్త్ర రంగంలోనూ, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. యువత పెద్ద కలలు కనాలని, వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని కలాం ఇచ్చిన సందేశం తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. డా. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి పిడిశెట్టి రాజు ఘనంగా నివాళులు అర్పించారు.

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

### ఓకేషనల్ టీచర్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా కన్వీనర్ కూరపాటి మల్లేష్



అక్కన్నపేట జూలై 26 విజన్ ఆంధ్ర : సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ఓ పి ఎస్ ప్రవేశపెట్టాలని ముఖ్యంగా సిపిఎస్ విధానం ద్వారా ఒకేషనల్ టీచర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కేవలం వారికి పెన్షన్ రూపంలో 1000 నుండి 4000 మాత్రమే వస్తున్నాయనిఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఒకేషనల్ టీచర్లు 1984 నుండి రెగ్యులర్ టీచర్లతో సమానంగాపని చేస్తున్నప్పటికీ వారికి 2009 నుండి సర్వీస్ ఇవ్వడం జరిగింది ఒకేషనల్ టీచర్లు 8 9 10 తరగతులకుబోధిస్తున్నారు కాబట్టి వారికి వాస్తవంగా స్కూల్ అసిస్టెంట్ స్కేల్ ఇవ్వాలని మరియు వారికి ప్రమోషన్లు జడ్పీహెచ్ఎంలుగా ఎంఈవోలుగా ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారుపాత సర్వీసును పరిగణలోకి తీసుకొని వారికి ఓపిఎస్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు గడిచిన 23 ఏళ్లుగా సిపిఎస్ విధానం వల్లఉపాధ్యాయ ఉద్యోగులు ఆర్థిక సామాజిక సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రకారం ఇతర రాష్ట్రాలైన రాజస్థాన్ ఝార్ఖండ్ హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో అమలు చేసినట్లే తెలంగాణలో కూడా సిపిఎస్ ను రద్దుచేసి ఓపిఎస్ను అమలు పరచాలని ఆయన డిమాండ్ చేశారు మరోవైపు ఉపాధ్యాయ ఉద్యోగుల జీతాల నుండి ప్రతి నెల 200 కోట్ల వరకు కార్పోరేట్ సంస్థలకు తరలిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం వెంటనే స్పందించి ఓ పి యస్ పునరుద్దరణ ద్వారా ప్రజాధనాన్ని ఉద్యోగుల భవిష్యత్తును కాపాడాలని ఆయన పేర్కొన్నారు

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముందుగా ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

**- మంత్రి పొన్నం ప్రభాకర్**

అక్కన్నపేట జూలై 27విజన్ ఆంధ్ర : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాకుగా చూపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముందుగా కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఒక్కరోజులో ఏర్పడినవి కావని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే భారీగా పేరుకుపోయిన వారసత్వ సమస్య అని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు బకాయిలు పెడుతున్న సమయంలో రామచంద్రరావు ఎందుకు మౌనం వహించారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు.

నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ, దేశంలో తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడ ఈ పథకాన్ని అమలు చేస్తుందో స్పష్టం చేయాలని మంత్రి సవాల్ విసిరారు. విద్యార్థుల సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని, కనీసం రాష్ట్రాలపై ఉన్న ఆర్థిక భారాన్ని పంచుకుంటూ కేంద్రం కూడా తన వంతు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 21 సంవత్సరాలకు తగ్గించాలని చేసిన ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. ఆ అంశంపై సమాధానం చెప్పకుండా దృష్టి మళ్లించేందుకే బీజేపీ నాయకులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే వయోపరిమితిని 21 సంవత్సరాలకు తగ్గించే ప్రతిపాదనకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ఇస్తుందా? లేదా? అనే విషయాన్ని రామచంద్రరావు స్పష్టంగా చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. విద్యార్థి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన అభిప్రాయంతో ఉందన్నారు. ఈ విషయంలో బీజేపీ వైఖరి ఏమిటో వెల్లడించాలని, విద్యార్థి సంఘాల ఎన్నికలకు బీజేపీ మద్దతు ఇస్తుందా? లేదా వ్యతిరేకిస్తుందా? అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు . పరీక్ష పేపర్ల లీకేజీ తో విద్యార్థుల ప్రాణాలను బలి తీసుకుంటున్న బిజెపి కి విద్యార్థుల గురించి ప్రశ్నించే కనీస నైతిక అర్హత లేదు.

## సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక లాభాలు: పాపన్నగారి శ్రీనివాస్ రెడ్డి

అక్కన్నపేట, జూలై 27విజన్ ఆంధ్ర): సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూసారం పెరగడంతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గి, నాణ్యమైన పంటలతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతు సంఘం మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు పాపన్నగారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువుల ఎరువు, వానపాముల ఎరువు (వెర్మికంపోస్ట్), పచ్చిరొట్ట ఎరువులను రైతులు ఎక్కువగా వినియోగించాలని సూచించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. రసాయన రహిత వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో రోజురోజుకు డిమాండ్ పెరుగుతోందని, సహజ సిద్ధంగా పండించిన పంటలను కొనుగోలు చేయడానికి వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయం అనేది కృత్రిమ రసాయన ఎరువులు, పురుగుమందులు, జన్యుమార్పిడి విత్తనాలను ఉపయోగించకుండా, ప్రకృతి సిద్ధమైన వనరులతో పంటలను సాగు చేసే సుస్థిర వ్యవసాయ విధానమని వివరించారు. దీనిని జీవ వ్యవసాయం లేదా పర్యావరణ వ్యవసాయం అని కూడా పిలుస్తారని చెప్పారు.

ఆవుపేడ, గోమూత్రం, శనగపిండి, బెల్లం, చెట్ల ఆకులు వంటి సహజ పదార్థాలతో సేంద్రియ ఎరువులు, జీవామృతం వంటి పోషక ద్రావణాలను తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఒకే పంటను పదేపదే సాగు చేయకుండా పంటల మార్పిడి చేపట్టడం వల్ల నేలలో నత్రజని శాతం పెరిగి భూసారం మెరుగుపడుతుందని చెప్పారు.



జనుము, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి పూతకు రాకముందే భూమిలో కలియదున్నడం ద్వారా నేలలో సూక్ష్మజీవుల పెరుగుదలకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

జీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తూ, 200 లీటర్ల నీటిలో 10 కిలోల ఆవుపేడ, 10 లీటర్ల గోమూత్రం, 2 కిలోల బెల్లం, 2 కిలోల పప్పు దినుసుల పిండి, ఒక గుప్పెడు పుట్టమట్టి లేదా గట్టు మట్టి కలిపి గోనె సంచి లేదా కాటన్ గుడ్డతో కప్పి 10 నుంచి 12 రోజుల పాటు నిల్వ ఉంచాలని తెలిపారు. అనంతరం దానిని సాగునీటితో కలిపి లేదా వడకట్టి పంటలపై పిచికారీ చేయవచ్చని చెప్పారు.

వేప కషాయం, బ్రహ్మాస్త్రం వంటి సహజ కషాయాలను ఉపయోగించడం ద్వారా చీడపీడలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, రైతు నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

---

# బడి పిల్లలకు శుచిగా.. రుచిగా హాట్ బ్రేక్‌ఫాస్ట్




### రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఏడబోయిన

ఆక్కన్నపేట్, జూలై 27విజన్ ఆంధ్ర : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆకలితో తరగతులకు హాజరు కాకుండా ఉండేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోంది. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సహకారంతో ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వేడి వేడి, పరిశుభ్రమైన అల్పాహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నారు. ఇప్పటికే ఐదు మెగా సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారా సుమారు లక్షన్నర మంది విద్యార్థులకు ప్రతిరోజు బ్రేక్‌ఫాస్ట్ అందుతుండగా, భవిష్యత్‌లో 20 లక్షల మంది విద్యార్థులకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ కార్యక్రమాన్ని మొదట వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయగా విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 23,103 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.720 కోట్ల వ్యయంతో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నారు. వారంలో ఆరు రోజుల పాటు ఇడ్లీ--సాంబార్, పూరీ--ఆలూ కుర్మా, దోసె--చట్నీ, ఉప్మా--చట్నీ, మిల్లెట్ ఇడ్లీ--సాంబార్, బోండా--చట్నీ వంటి విభిన్న రకాల అల్పాహారం సరఫరా చేస్తున్నారు. రోజు విడిచి రోజు పాలను కూడా అందిస్తున్నారు.

ప్రస్తుతం కొడంగల్, నార్సింగి, మహబూబ్‌నగర్, వరంగల్, సంగారెడ్డి జిల్లా కంది ప్రాంతాల్లో మెగా కిచెన్లు పనిచేస్తున్నాయి. ఈ నెల 27న ఖమ్మం జిల్లా మధిరలో మరో మెగా కిచెన్ ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి 798 పాఠశాలలలోని 44,125 మంది విద్యార్థులతో పాటు 8 జూనియర్ కళాశాలలలోని 3,100 మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందించనున్నారు.

కొన్ని జిల్లాల్లో కిచెన్లు లేక ఇతర జిల్లాల నుంచి ఆహారం తరలించాల్సి రావడంతో వేడి తగ్గే సమస్యలు ఎదురవుతున్నాయని, అందుకే ప్రతి జిల్లాలో ఒక మెగా కిచెన్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా పెరిగిందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఆకలితో తరగతులకు వచ్చే పరిస్థితి తగ్గడంతో విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటున్నారని వారు తెలిపారు. విద్యార్థుల అభిప్రాయాలను సేకరిస్తూ ఆహార నాణ్యతను నిరంతరం మెరుగుపరుస్తున్నట్లు హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

# ఉప్పరిగూడెంలో ఉచిత వైద్య శిబిరం

**- బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర పరీక్షలు నిర్వహించిన ఎంఎన్ఆర్ ఆసుపత్రి వైద్య బృందం**



చౌటకూర్, జులై 27 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండలంలోని ఉప్పరిగూడెం గ్రామంలో సోమవారం ఎంఎన్ఆర్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్‌తో పాటు పలు రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొల్ల మల్లేశం, మండల కాంగ్రెస్ పార్టీ సలహాదారు మండల శివకుమార్ పాల్గొని వైద్య శిబిరాన్ని పరిశీలించి ప్రజలు ఇలాంటి ఉచిత ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

# 'సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు'

**- చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి**

మందమర్రి, జులై 27 (విజన్ ఆంధ్ర) : తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండుగ నిలుస్తుందని క్యాతన్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి అన్నారు. ప్రతి ఆషాఢమాసంలో బోనాల పండుగను తెలంగాణలో అత్యంత వైభవంగా జరుగుతాయని గుర్తు చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని బొక్కల గుట్ట గాంధారి ఖిల్లా మైసమ్మ బోనాల జాతరలో చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి నెత్తిన బోనమెత్తి మైసమ్మ తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి వస్త్రాలను, ఒడి బియ్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివాసీ,నాయక్ పోడ్,గిరిజనులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు.

# గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం ప్రగతి సాధిస్తుంది.

**- చేగూర్ సర్పంచ్ మంకల శ్రీశైలం.**

**- చేగుర్ గ్రామంలో అండర్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన**

నందిగామ:జులై 27(విజన్ ఆంధ్ర న్యూస్); గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం ప్రగతి సాధిస్తుందని,చేగూర్ సర్పంచ్ మంకల శ్రీశైలం అన్నారు.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల పరిధిలోని చేగూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్,తొమ్మిదవ వార్డుసభ్యులు గునుగుర్తి రాజశేఖర్ మరియు రాయపు రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం తొమ్మిదవ మరియు పదవ వార్డులలో నూతన అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆవులమంద శివశంకర్,చేగుర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పబ్బే సుధాకర్, వార్డుసభ్యులు ప్రవీణ్,పూజిత పబ్బే,కావలి భీమయ్య,అర్చన,పబ్బే శేఖర్,పీఏసీఎస్ డైరెక్టర్ సతీష్,మాజీ వార్డు సభ్యులు అనిల్ రెడ్డి, మల్లాపురం యాదయ్య, పబ్బే రవితేజ, నందిగామ మండలం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మంగళ మహేష్, కాండదా అరవింద్,ఎర్రోళ్ల ప్రవీణ్ గునుగుర్తి దశరథ,పబ్బే శీను కొంగరి నరసింహ,గునుగుర్తి నరసింహ, దొర రమేష్,మల్లపురం శంకర్ ఎర్రోళ్ల నవీన్, భీమయ్య ,మల్లాపురం ఏసేపు,జింగ బాలరాజ్ ఎర్రోళ్ల నరసింహ,పబ్బే శేఖర్, గునుగుర్తి రత్నయ్య కందాద రవి, కొంగరి కృష్ణ,గునుగుర్తి విజయ్ గునుగుర్తి ప్రభాకర్,మంకాల పవన్ , గ్రామ ప్రజలు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గడ్చిరోలి లో పోలీస్ రికార్డు ప్రకారం మావోయిస్టులు లేరు

**- ఎస్ పి ఎం రమేష్ ప్రకటన**

**- మావోయిస్టుల పేరుతో భయాందోళన సృష్టిస్తున్న నకిలీ మావోయిస్టుల గుట్టురట్టు**

**- ఇద్దరు వ్యక్తులు అరెస్ట్**



చర్ల, జులై 27 (విజన్ ఆంధ్ర): గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టుల ప్రాభవం పూర్తిగా అంతరించిపోయినప్పటికీ కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది, అమాయక పౌరులను మావోయిస్టులుగా చిత్రీకరించే కుట్రలో భాగంగా ఏర్పాటు చేసిన నకిలీ పోస్టర్లు, బ్యానర్ల ఉదంతాన్ని పోలీసులు విజయవంతంగా ఛేదించారు, ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా గడ్చిరోలి పోలీస్ సూపరింటెండెంట్ ఎం రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు దీనిపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నారు. ఘటనా స్థలం జిజవండి తోలుకడే జనయ రోడ్డు సమీపంలో పిప్లి బుర్గికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో రోజి పోస్ట్ ఫత్యా పూర్వి ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది, ఎడమ చేయి గుర్తు ఉన్న ఆవు బొమ్మ దిశానిర్దేశక చిహ్నం లోఖండి యాంగిల్ కింది చేయి ఉన్న ఎర్రటి రంగు గుడ్డ బ్యానర్ నేల దగ్గర ఎర్రటి రంగు కాగితపు బ్యానర్ మరియు దాని పక్కనే పాండ్య రంగు కాగితపు పోస్టర్లు లభించాయి , పౌరులను తప్పుదారి పట్టించి వారిలో భయం కలిగించే ఉద్దేశంతోనే కూలీలను బలవంతంగా లేదా మభ్యపెట్టి వీటిపై రాయించే పనిలో నిమగ్నం చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు

ఈ పరిస్థితిని గడ్చిరోలి పోలీస్ శాఖ అత్యంత తీవ్రంగా పరిగణించింది, ఎస్పీ ఎం రమేష్ ప్రత్యేక ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సాంకేతిక వర్గాలు మరియు రహస్య సమాచారదాతల ద్వారా అందిన పక్కా సమాచారంతో నిందితులను గుర్తించారు,అరెస్టు అయిన నిందితులు శివ అనిల్ మిస్త్రీ వయస్సు నలభై ఎనిమిది సంవత్సరాలు నివాసం తరుణ్‌నగర్, తా పఖంజూర్ జిల్లా కాంకేర్ ఛత్తీస్‌గఢ్ మరియు రోహిత్ రంజిత్ మల్లిక్ వయస్సు ఇరవై ఐదు సంవత్సరాలు నివాసం వటేలి తా ఎటపల్లి జిల్లా గడ్చిరోలి,నిందితులపై తగిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి గడ్చిరోలి పోలీస్ స్టేషన్ పరిధిలో అరెస్టు చేయడం జరిగింది, పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి

గడ్చిరోలి పోలీస్ శాఖ రికార్డుల ప్రకారం జిల్లాలో ప్రస్తుతం ఒక్క మావోయిస్టు కూడా లేరని ఆపరేషన్ ఫైనల్ స్ట్రైక్ వంటి ప్రత్యేక ప్రచారాల ద్వారా మావోయిస్టుల బెడద పూర్తిగా నిర్మూలించబడిందని పోలీసులు స్పష్టం చేశారు, ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మి మోసపోవద్దని చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్పీ కోరారు. ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రజల్లో భయాందోళన వాతావరణం సృష్టించడానికి ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై అత్యంత కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు, ఈ కేసును విజయవంతంగా ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసు అధికారులు మరియు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో అవసరం

**- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి.**

**- రంగారెడ్డి జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ.**

**- నందిగామలో వన మహోత్సవా కార్యక్రమం.**



నందిగామ:జులై 27(విజన్ ఆంధ్ర న్యూస్); పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో అవసరమని,పచ్చని చెట్లు ప్రగతి మెట్లని,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవలని రంగారెడ్డి జిల్లా సర్పంచులు సంఘం అధ్యక్షుడు,నందిగామ స్థానిక సర్పంచ్ కొమ్ము కృష్ణ అన్నారు.వనమహోత్సవా కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం మండల కేంద్రమైన నందిగామ గ్రామపంచాయతీ సమీపంలోని పురవిద వెంచర్ లోని పది శాతం భూమిలో సోమవారం స్థానిక సర్పంచ్ కొమ్ము కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి పలు పలు రకాల వేయి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత కోసం గ్రామాల్లో చెట్లను పెంచాలని సూచించారు.గ్రామాన్ని పచ్చదనంతో నింపి, స్వచ్ఛమైన గాలి,ఆరోగ్యకరమైన వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరి రక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు.గ్రామంలోని ప్రతి ఒక్కరూ వారి ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటుకొని పరియవరణాని పరిరక్షించుకోవలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సారా వెంకటేష్ గౌడ్,ఏఏంసి డైరెక్టర్ చాకలి నర్సింహ,వార్డు సభ్యులు బొమ్మగల నరసింహ, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కేశమోని రామచందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, నాయకులు శివకుమార్, సురేష్, మురళీ, సురేష్, రహమత్ అలీ,పూర్ణం శ్రీకాంత్,సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# మర్కుక్ రైతు వేదికలో విత్తన మేళా కార్యక్రమం



మార్కుక్ జూలై 27,(విజన్ ఆంధ్ర ):మర్కుక్ మండల రైతు వేదికలో సోమవారం నాడు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు,ప్రభుత్వం సూచించిన పంటల సాగు విధానాలు ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బోయినపల్లి రాము మాట్లాడుతూ రైతులు ధృవీకరించిన విత్తనాలను మాత్రమే వినియోగించాలని,వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఆత్మ కమిటీ చైర్మన్ తాండ కనకయ్య గౌడ్,మర్కుక్ గ్రామ సర్పంచ్ రాణి మల్లేష్,ఇప్పలగూడెం సర్పంచ్ నాగిరెడ్డి,చేబర్తి సర్పంచ్ యాదగిరి,కాశిరెడ్డిపల్లి సర్పంచ్ భాస్కర్,గంగాపూర్-–యూసఫ్‌ఖాన్‌పల్లి సర్పంచ్ శ్యామల ప్రవీణ్,కాశిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ మహేష్,వ్యవసాయ విస్తరణ అధికారులు పృధ్వి,విష్ణు భాను శ్రీ,స్థానిక విత్తనాల డీలర్లు,మండలంలోని వివిధ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాలనీల అభివృద్ధికి సంక్షేమ సంఘాలే బలమైన వేదిక

లక్ష్మీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీకి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అభినందనలు
-నూతన కమిటీ సభ్యులకు శాలువాలతో సత్కారం
-కాలనీల సమగ్రాభివృద్ధిలో నివాసుల భాగస్వామ్యం అవసరం
-కోట్లాది రూపాయలతో మౌలిక వసతుల కల్పన
-లక్ష్మీనగర్ అభివృద్ధికి నిరంతర సహకారం అందిస్తాం
-ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు
-కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, సంఘ సభ్యులు

కుత్బుల్లాపూర్, జూలై 27: (విజన్ ఆంధ్ర); కాలనీల సమగ్రాభివృద్ధిలో రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ల పాత్ర అత్యంత కీలకమని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సోమవారం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 129వ డివిజన్ సూరారం పరిధిలోని లక్ష్మీనగర్ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిగా ఎన్నికైన నామిరెడ్డి అమృత, ప్రధాన కార్యదర్శి హరిశంకర్ రావుతో పాటు నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాలు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా నిలుస్తాయని పేర్కొన్నారు. లక్ష్మీనగర్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అనేక కాలనీలు, బస్తీల్లో కోట్లాది రూపాయలతో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కూడా లక్ష్మీనగర్ కాలనీ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొండకల్ల యాదిరెడ్డి, కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి, కోల శ్రీకాంత్ ముదిరాజ్, వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు సురేష్, కె. రాఘవేందర్ రెడ్డి, ఇంద్రసేన, ప్రభులింగం, కె.వి. రమణ, ఏ. వెంకటేశ్వర్ రావు, సభ్యులు సాయి ప్రేమ్, వెంకటప్ప రెడ్డి, ప్రసాద్ రెడ్డి, ఎన్. యశ్వంత్ రెడ్డి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



# చౌటకూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల పరిసరాల పరిశుభ్రతకు శ్రీకారం

## - మాజీ ఎంపీపీ సుభాష్‌రెడ్డి ముఖ్యంగా
## - గ్రామ సర్పంచ్ పార్కుల రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో

చౌటకూర్, జూలై 27 (విజన్ ఆంధ్ర):– చౌటకూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్) బయట పరిసరాలను పరిశుభ్రంగా, విద్యార్థులకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ సర్పంచ్ పార్కుల రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల వెలుపల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మొరం వేయించే పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ సుభాష్‌రెడ్డి ముఖ్యంగా సహకరించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని సర్పంచ్ పార్కుల రామ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు మోహన్ రెడ్డి, వినయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్, రాజేశ్వర్ గౌడ్, కరుణాకర్, వార్డు సభ్యులు అశోక్, చక్రపాణి, గంగారాం తదితరులు పాల్గొని పరిశుభ్రత కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరిస్తామని తెలిపారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం...

- అందరికీ అందుబాటులో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- పేట్ బషీరాబాద్ క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో వరుస భేటీలు

పలు ఆహ్వాన పత్రాలు, వినతిపత్రాలు స్వీకరించిన బీఆర్ఎస్ ఎల్పీ విప్
నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబాటుగా పనిచేస్తామన్న ఎమ్మెల్యే
గాజులరామారం బీఆర్ఎస్ నాయకుడు శ్రావణ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు
శాలువాతో సత్కరించి ఆశీర్వదించిన కేపీ వివేకానంద్
ప్రజలతో నిరంతర అనుబంధమే తన బలం అని ఎమ్మెల్యే వ్యాఖ్య



కుత్బుల్లాపూర్, జులై 27 విజన్ ఆంధ్ర: ప్రజా సంక్షేమమే పరమావధిగా, నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను సోమవారం పేట్ బషీరాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివిధ సామాజిక, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలతో పాటు ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను అందజేశారు. వాటిని స్వీకరించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సంబంధిత అంశాలపై సానుకూలంగా స్పందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గాజులరామారం డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రావణ్ తన పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ శ్రావణ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో పాటు ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నగదు రు. 5001 బహుమతులు అందజేత

నారాయణఖేడ్ జులై 27 ( విజన్ ఆంధ్ర) : మరో ఎన్నికల హామీ నెరవేర్చిన దోసపల్లి సర్పంచ్ బిరదర్ దత్తు.... మనూరు మండల పరిధిలోని దోసపల్లి గ్రామ సర్పంచ్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు బీరధర్ దత్తు మరొక హామీ నెరవేర్చారు సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నారు సోమవారం దోసపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2025"2026 జడ్.పి.హెచ్.ఎస్ మనూరు పాఠశాలలో చదివి ఉత్తీర్ణత సాధించిన గ్రామానికి చెందిన బిరదర్ అపర్ణ మొదటి బహుమతి 5100 బిరదర్ శ్రీనిజ రెండవ బహుమతి 2500 నగదు అందజేశారు విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు శాలువా మెమొంటో తో సత్కరించారు సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు సర్పంచ్ బిరదర్ దత్తు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి విద్యార్థులపై తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశయాలను నెరవేర్చి ఉన్నంత శిఖరాలు అధిరోహించాలని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు . డాక్టర్ అమృత్. గ్రామస్తులు రాజశేఖర్ . అశోక్. సత్యనారాయణ. నారాయణ.రాజ్ కుమార్. రవికుమార్. జయరాజ్. గ్రామస్తులు పాల్గొన్నారు



# పేపర్ కప్పులు, ప్లాస్టిక్‌కు గుడ్‌బై...

స్టీల్ గ్లాసుల వినియోగమే ఆరోగ్య రక్షణ
లయన్స్ క్లబ్ హైదరాబాద్ సనత్‌నగర్ ఆధ్వర్యంలో వినూత్న అవగాహన కార్యక్రమం
వేడి పానీయాలకు స్టీల్ గ్లాసుల వినియోగంతో ఆరోగ్య పరిరక్షణకు పిలుపు
ప్లాస్టిక్, పేపర్ కప్పుల వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచన
'మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది' - లయన్ అన్నెం కోటిరెడ్డి
సామాజిక బాధ్యతతో ముందుకొచ్చిన లయన్స్ క్లబ్ సభ్యులు



కుత్బుల్లాపూర్, జులై 27 (విజన్ ఆంధ్ర): పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా లయన్స్ క్లబ్ హైదరాబాద్ సనత్‌నగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులందరూ పేపర్ కప్పులు, ప్లాస్టిక్ గ్లాసులను పూర్తిగా పక్కనపెట్టి స్టీల్ గ్లాసుల్లోనే టీ, కాఫీ వంటి వేడి పానీయాలను సేవిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ, "మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ఆరోగ్యంపై చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భవిష్యత్తులో తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) సైతం జీవనశైలిలో మార్పులు, సురక్షిత ఆహారపు అలవాట్లు, హానికర పదార్థాల వినియోగాన్ని తగ్గించుకోవాలని నిరంతరం సూచిస్తోంది" అని పేర్కొన్నారు. వేడి పానీయాలను పేపర్ కప్పులు లేదా ప్లాస్టిక్ పాత్రల్లో తీసుకోవడం కంటే స్టీల్ గ్లాసుల్లో సేవించడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. అలాగే ప్లాస్టిక్ ప్లేట్లు, ఒకసారి మాత్రమే వినియోగించే పాత్రలను వీలైనంత వరకు దూరంగా ఉంచి, పర్యావరణహితమైన , ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, ప్రజలు తినే ఆహారం నాణ్యమైనదేనా, కల్తీ రహితమా అనే విషయాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ఆహారపు అలవాట్లలోనూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు. ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రతి కుటుంబం ఆచరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్ బి. సుధాకర్, లయన్ వి. తిరుపతి రెడ్డి, లయన్ హనుమంతు నాయుడు, లయన్ అనంత రెడ్డి, లయన్ నాగమల్లేశ్వరరావు, లయన్ జి.వి. రమణ రెడ్డి తదితరులు పాల్గొని స్టీల్ గ్లాసుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు తమ వంతు కృషి చేయాలని సంకల్పించారు.

# కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాల రాజ్యం

అనుమతులు ఒకలైతే.. క్షేత్రస్థాయిలో నిర్మాణాలు మరోలా!

స్టిల్ట్ ౦2 అనుమతి.. నిర్మాణం మాత్రం స్టిల్ట్ ౦4 వరకు!

జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుటే బాధితుల వినూత్న నిరసన

సీజ్ చేసిన భవనాల్లోనూ కొనసాగుతున్న నిర్మాణాలు.. ఆసుపత్రుల నిర్వహణపై ఆరోపణలు

సెట్‌బ్యాక్ నిబంధనలకు తూట్లు.. ప్రజల భద్రతపై తీవ్ర ఆందోళన

'ఎస్టీఎఫ్' ప్రకటనలకే పరిమితం.. క్షేత్రస్థాయిలో చర్యలు శూన్యం

అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

కుత్బుల్లాపూర్, జులై 27 (విజన్ ఆంధ్ర): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని జీహెచ్ఎంసీ కుత్బుల్లాపూర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. నిర్మాణ అనుమతులు ఒక విధంగా తీసుకుని, క్షేత్రస్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షణలో లోపాలు, ఫిర్యాదులపై స్పందన లేకపోవడం వల్ల జోన్ వ్యాప్తంగా అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరుసగా వందల సంఖ్యలో ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోవడంతో బాధితులు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. అక్రమ నిర్మాణానికి సంబంధించిన నమూనాను చేతబట్టి కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కార్యాలయానికి చేరుకుని సర్కిల్ కార్యాలయం ఎదుటే నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించి అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికుల కథనం




ప్రకారం సూరారం గ్రామం, గాజులరామారం సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్--115లో స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తుల నిర్మాణానికే అనుమతి మంజూరైనప్పటికీ, నిబంధనలను ఉల్లంఘిస్తూ స్టిల్ట్ ప్లస్ నాలుగు అంతస్తుల వరకు నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు. అంతేకాకుండా తప్పనిసరిగా వదలాల్సిన సెట్‌బ్యాక్‌లను కూడా పాటించడం లేదని పేర్కొన్నారు. ఈ నిర్మాణాన్ని తక్షణమే సీజ్ చేసి అదనంగా నిర్మించిన అంతస్తులను తొలగించాలని తొమ్మిది మంది స్థానికులు అధికారులను కోరారు. అదేవిధంగా జోనల్ కార్యాలయానికి సమీపంలోనే నిర్మాణంలో ఉన్న భారీ కన్వెన్షన్ హాల్ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. బ్యాంక్ కాలనీలో గతంలో అధికారులు సీజ్ చేసిన భవనంలో నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రస్తుతం ప్రైవేట్ ఆసుపత్రి నిర్వహిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొంటున్నారు. సుభాష్‌నగర్ 40 ఫీట్ రోడ్డులో రమావత్ స్కూల్ ఎదురుగా ఉన్న నిర్మాణంలో జి ప్లస్ 2కు మాత్రమే అనుమతులు తీసుకుని, సెల్లార్‌తో పాటు జి ప్లస్ 5, పెంట్‌హౌస్ నిర్మించారని ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్మాణాన్ని అధికారులు గతంలో సీజ్ చేసినప్పటికీ పనులు పూర్తిచేసి ప్రస్తుతం 'ఆదర్శ్ ఫిజికల్ అకాడమీ' పేరుతో కాలేజీ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. దీనిపై పలు ఫిర్యాదులు అందినా అధికారులు చర్యలు తీసుకోకుండా సీజ్ చేశామని మాత్రమే చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. దుండిగల్ సర్కిల్ పరిధిలో గండి మైసమ్మ ప్రధాన రహదారిపై తాజా హోటల్ సమీపంలో జి ప్లస్ 2కు అనుమతులు తీసుకుని సెల్లార్‌తో పాటు జి ప్లస్ 5 వాణిజ్య భవనం నిర్మిస్తున్నారని ఆరోపించారు. ఈ నిర్మాణాన్ని కూడా గతంలో అధికారులు సీజ్ చేసినప్పటికీ, పనులు పూర్తికాకుండా నిలిపివేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. దీనిపై పలు దినపత్రికల్లో వార్తలు వచ్చినా, అనేక ఫిర్యాదులు అందినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని సర్వే నంబర్ 109లో ఓ యజమాని జి ప్లస్ 2కు అనుమతులు తీసుకుని జి ప్లస్ 3 వాణిజ్య భవనం నిర్మించారని ఆరోపించారు. దీనిలో పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి 11 గజాలు కూడా కబ్జా చేసి మరి నిర్మాణం చేపట్టారని వాపోయారు. దీనిపై రెవెన్యూ అధికారులు బాచుపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడంతో పాటు టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణాన్ని సీజ్ చేసినప్పటికీ, ప్రస్తుతం భవనం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఈ విధంగా కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతున్నప్పటికీ, వాటిని అరికట్టాల్సిన అధికార యంత్రాంగం సమర్థవంతంగా వ్యవహరించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాల నియంత్రణ కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్) బృందాలను ఏర్పాటు చేస్తామని అధికారులు ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి పనితీరు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. సర్కిల్ కార్యాలయం ఎదుటే నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగుతున్న పరిస్థితి ఉంటే, జోన్‌లోని ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని అన్ని అనుమానాస్పద నిర్మాణాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలతో సమగ్ర విచారణ చేపట్టాలని, నిర్మాణ అనుమతులు, సెట్‌బ్యాక్‌లు, అంతస్తుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన బిల్డర్లతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన సంబంధిత అధికారులపై కూడా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## స్వాతంత్ర్య దినాన పేదలకు తోఫా

ఆర్థికంగా అత్యంత అవసరంలో ఉన్న వర్గాలకు చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం మొదటి దశలో ఒంటరి మహిళలు మరియు వితంతు పెన్షన్లను మంజూరు చేయనుంది. వీరి తర్వాత దశల వారీగా ఇతర అర్హులకు కూడా పెన్షన్లు ఇవ్వనున్నారు.

సీఎం చేతుల మీదుగా ప్రారంభం

ఈ భారీ కార్యక్రమాన్ని స్వయంగా ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో లాంఛనంగా ప్రారంభించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కొత్త పెన్షన్లను విడుదల చేయడం ద్వారా "ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికీ భరోసా" అనే సందేశాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది. కొత్త పెన్షన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న లబ్ధిదారుల్లో ఇప్పుడు ఆనందం వ్యక్తమవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని అర్హులైన లబ్ధిదారులకు ఈ నిర్ణయం పెద్ద ఊరట కలిగించనుంది. రేవంత్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల అమలులో చూపిస్తున్న చిత్తశుద్ధికి ఈ నిర్ణయం మరో నిదర్శనంగా నిలుస్తుందని అధికారులు చెబుతున్నారు.

## పడకల్ గ్రామంలో జలసిరిపై గ్రామసభ సమావేశం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో**

తలకొండపల్లి, జులై 27, (విజన్ ఆంధ్ర): రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జల సిరి పై గ్రామసభ నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తలకొండపల్లి ఎంపీడీవో సీతారామమ్మ, మాట్లాడుతూ.. వర్షపాతం తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను రైతులను అప్రమత్తం చేయడం కోసం ముందస్తు చర్యలు చేపట్టాలని అని గ్రామసభ నిర్వహించి గ్రామ ప్రజలను తమ తమ వాకిళ్లలో ఇంకుడు గుంతలు తీసుకోవాలని, మరియు ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులందరూ పాంపాండ్ కోరారు అప్లై చేసుకోవాలని చెప్పారు... అగ్రికల్చర్ ఏఈఓ త్రిలోక్య మాట్లాడుతూ వర్ష బావ పరిస్థితుల దృష్ట్యా రైతులు ఆకుతడి పంటలు వేసుకోవాలని కోరారు, ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్వాడి టీచర్లు, బివిల్వోలు, బిఎల్ఎలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు...

## ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు ఆదేశాలు

భూపాలపల్లి జిల్లా జులై 27 (విజన్ ఆంధ్ర) : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన స్వయంగా వినతులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో మొత్తం 71 దరఖాస్తులు వచ్చాయని, స్వీకరించిన దరఖాస్తులు తగు చర్యల నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని స్పష్టం చేశారు. బాధితులకు తగిన న్యాయం జరిగేలా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంత కుమారి, భూపాలపల్లి ఆర్డీఓ హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యపు నీడలో రైతు మేళ అధికారుల తప్పిదమా?

**- ఆరుతడి పంటల విత్తనాలు తెప్పించాలి**

**- బిజెపి కిసాన్ సంఘ్ డివిజన్ ఇంచార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 27 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో నిర్లక్ష్యపు నీడలో రైతు మేళ ఉన్నదని అధికారుల తప్పిదమా అని బిజెపి కిసాన్ సంఘ్ డివిజన్ ఇంచార్జి కవ్వ వేణుగోపాల్ రెడ్డి అధికారులను ప్రశ్నించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు వేదిక ఎందుకు కూడా ఇలాంటి నిర్లక్ష్యమే అంటూ, హుస్నాబాద్ వ్యవసాయ శాఖ అధికారి,ఏడిఏ కానరావడం లేదన్నారు.మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక పర్యటన చేయండి ఇక్కడి అధికారుల పనితీరును తెలుసుకోవాలని కోరారు.అధికారుల నిర్లక్ష్యంతో రైతులు మేళాకు రావడం లేదని,రైతు మేళా యందు ప్రభుత్వము చెప్పిన ఆరుతడి పంటలు సంబంధించిన విత్తనాల కరువు,విత్తనాల గురించి ఏవో అని అడిగితే సమాధానం లేని ప్రశ్నలు ప్రజా ప్రతినిధుల ముందే నిర్లక్ష్యపు సమాధానాలు ఉన్నాయన్నారు.మార్కెట్ చైర్మన్ మరియు పాలకవర్గము సొసైటీ చైర్మన్ ముందే రైతులు నిలదీత,ఇదేనా రైతు మేలా అంటే నిర్లక్ష్యం వహించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కవ్వ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.రైతు మేళాలో ప్రభుత్వ విత్తనాలు కరువు ప్రభుత్వ సబ్సిడీ కరువు కేవలం ప్రైవేట్ డీలర్ల దగ్గర ఉన్నటువంటి విత్తనాలే నని,ప్రభుత్వ పరిశోధనా కేంద్రాల్లో తయారైన విత్తనాల లేవా ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.జిల్లా కలెక్టర్ మరియు జెడిఎహుస్నాబాద్ రైతు మేళా ను వెంటనే సందర్శించాలన్నారు.27 మరియు 28 మరియు 29లో జరిగే రైతు మేధాలయందు ప్రభుత్వము నిర్ణయించిన 63 పంటల వివరాలతో పాటు వాటికి సంబంధించిన విత్తనాలు రైతులకు అవగాహన చేయించాలని,మరియు స్థానికంగా లేకుంటే జిల్లా అధికారుల ద్వారా తెప్పించాలన్నారు.వెంటనే ఆరితడి పంటల విత్తనాలు తెప్పించి రైతులకు సబ్సిడీపై ఇవ్వకుంటే భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతు మేళా మరియు రైతు వేదిక ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

# తెలంగాణ ఉద్యమ కారులకు పెన్షన్ ను అమలు చేయండి



భూపాలపల్లి : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఇచ్చిన పిలుపుమేరకు నేడు భూపాలపల్లి ప్రెస్ క్లబ్ నందు తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ పట్టణ అధ్యక్షులు యాళ్ల సురేందర్ అధ్యక్షతన ప్రెస్ మీట్ జరిగింది. రాష్ట్ర సహాయ కార్యదర్శి మందల రవీందర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పైడిపల్లి రమేష్, రాష్ట్ర నాయకులు పున్నం రవి, కత్తి సంపత్, రాష్ట్ర మహిళా కార్యదర్శి బందెల ప్రసన్న, మాట్లాడుతూ ప్రభుత్వం నియమించిన తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపు కమిటీ తెలంగాణ ఉద్యమకారులు, ఉద్యమ సంఘాలతో సంప్రదింపులు పూర్తి అయిన నేపథ్యంలో కాలయాపన చేయకుండా కాలపరిమితి విధించి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి,కార్పొరేషన్ ఏర్పాటు చేసి, ప్రతి ఒక్క ఉద్యమ కారునికి 250 గజాల ఇంటి స్థలం, ఝార్ఖండ్ రాష్ట్రం ఇస్తున్న విధంగా నెలకు 25000 రూపాయల పెన్షన్, విద్య రంగంలో రిజర్వేషన్, కార్పొరేట్ హాస్పిటల్స్ లో ఉచిత వైద్యం, బస్సు, రైళ్లలో ఉచిత ప్రయాణం కల్పిస్తూ ,తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం సంక్షేమం దిశగా కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం మరో ఉద్యమం చేస్తుందన్నారు.కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపరాజు సాంబ లక్ష్మి, మేకల సంపత్, పున్నం రవి, ముద్దమళ్ళ భార్గవ్, క్యాతరాజు సాంబమూర్తి, బండారి రవి,రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రూపిరెడ్డి సునీతరెడ్డి,బందెల ప్రసన్న, రాతిపెల్లి శారద, జిల్లా కార్యదర్శి బొమ్మెరా రాజేశ్వరి,మండల మహిళా అధ్యక్షురాలు గాదాం జయ, పోషినేని రాజేశ్వరి,సూర రాజేష్, పొలవేన అశోక్,కప్పల శ్యామ్,మండ రమాదేవి,తామర మధునమ్మ, మంకీల్ల భూలక్ష్మి,రాపాల పోషమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గొంగ్లూర్ గ్రామ రైతుల ఆవేదన..

## ఖరీఫ్ పంట పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయొద్దని వినతి



చౌటకూర్, జూలై 27 (విజన్ ఆంధ్ర ): పుల్కల్ మండల పరిధిలోని గొంగ్లూర్ గ్రామ రైతులు తమ సమస్యలను వివరిస్తూ జిల్లా కలెక్టర్‌తో పాటు తహసీల్దార్, విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ, అటవీ శాఖ, నీటిపారుదల శాఖ అధికారులకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు.
రైతులు తెలిపిన వివరాల ప్రకారం, మంజీరా పరివాహక ప్రాంతంలోని బ్యాక్‌వాటర్ నుంచి గత 23 సంవత్సరాలుగా మోటార్లు, పైప్‌లైన్ల ద్వారా నీటిని తీసుకుని వరి సాగు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్-2026 సీజన్‌లో వరి నారు వేసి, ఎకరాకు సుమారు రూ.25 వేల వరకు ఖర్చు చేసి నాట్లు పూర్తి చేశామని తెలిపారు. అయితే ప్రస్తుతం బ్యాక్‌వాటర్ నుంచి మోటార్లు తొలగించి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని , విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని జూన్ నెల మొదటి వారాల్లోనే తెలియజేసి ఉంటే తాము ఇంత భారీ పెట్టుబడి పెట్టి సాగు చేపట్టేవాళ్లం కాదని పేర్కొన్నారు.ప్రస్తుతం పంట పెరుగుదల దశలో ఉండగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తే తీవ్ర నష్టం వాటిల్లి రైతులు ఆర్థికంగా కుంగిపోతారని తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్ పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరాను కొనసాగించాలని, వచ్చే రబీ సీజన్‌లో బ్యాక్‌వాటర్‌పై ఆధారపడి పంటలు సాగు చేయబోమని అధికారులకు హామీ ఇచ్చారు.ఖరీఫ్ పంట పూర్తయ్యేలోపు విద్యుత్ సరఫరా నిలిపివేస్తే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి ఖరీఫ్ పంట పూర్తయ్యే వరకు విద్యుత్ సరఫరాను కొనసాగించాలని రైతులు అధికారులను కోరారు.

# బిఆర్ఎస్ పార్టీ విచ్చిన్నం చేసే చర్యలు మానుకోవాలి... బిఆర్ఎస్ కార్యకర్తలు

భూపాలపల్లి జిల్లా జులై 27 (విజన్ ఆంధ్ర) బ్రహ్మ దేవుడు అడ్డొచ్చిన మాజీ స్పీకర్ మధుసూదనచారి ఎమ్మెల్యేగా ఏ పార్టీ నుండి ప్రాతినిధ్యం వహిస్తారో చెప్పాలని భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రశ్నించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి పట్టణ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జిగా భూపాలపల్లి నియోజకవర్గం యొక్క బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధిగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి ఉంటారు ఆయన నాయకత్వం లోనే బిఆర్ఎస్ పార్టీ యొక్క కార్యచరణ ఉ ంటుంది అని వేల మంది కార్యకర్తల సాక్షిగా, భూపాలపల్లి నియోజకవర్గ ప్రజల సాక్షిగా భారత రాష్ట్ర సమితి పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు గారు స్పష్టం చేసిన విషయం విధితమే. రాష్ట్రంలో మరియు భూపాలపల్లి నియోజకవర్గం లో బిఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన చేస్తున్న పోరాటానికి ప్రజలు భ్రమరధం పడుతున్న తరుణంలో బిఆర్ఎస్ పార్టీని కార్యకర్తలను విచ్చిన్నం చేస్తూ మాజీ స్పీకర్ మధుసూదనాచారి గారి కుమారుడు నిన్న ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో బ్రహ్మదేవుడు దిగివచ్చినా నరే భూపాలపల్లి నియోజకవర్గం నుండి మధుసూదనాచారి,ఎమ్మెల్యేగా పోటీ చేస్తారు. పభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తున్న ఈ సమయంలో, పార్టీలో అంతర్గత విభేదాలకు తావిచ్చే వ్యాఖ్యలు కార్యకర్తల్లో అయోమయం, నిరుత్సాహాన్ని కలిగిస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకుల కుటుంబ సభ్యుల నుంచి వచ్చే ప్రతి వ్యాఖ్య కార్యకర్తలపై ప్రభావం చూపుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. భూపాలపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలంటే, ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త పార్టీ అధిష్ఠానం నిర్ణయాలకు కట్టుబడి పనిచేయాలి. అందువల్ల బీఆర్ఎస్ పార్టీ అధినేత గౌరవ కేసీఆర్ , పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరవ కేటీఆర్ భూపాలపల్లి నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితిపై దృష్టి సారించి, పార్టీ శ్రేణులకు స్పష్టమైన మార్గదర్శకత్వం అందించాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్ట పడుతున్న నిబద్ధత కలిగిన కార్యకర్తల మనోధైర్యాన్ని కాపాడటం,పార్టీలో ఐక్యతను బలోపేతం చేయడం, అధిష్ఠానం నిర్ణయాలకు విరుద్ధంగా సందిగ్ధత కలిగించే చర్యలను నివారించడం అత్యవసరం. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరికీ మా విజ్ఞప్తి ఒక్కటే. మన లక్ష్యం వ్యక్తులను గెలిపించడం కాదు, కేసీఆర్ గారి ఆశయాలను, కేటీఆర్ గారి నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ భూపాలపల్లి నియోజకవర్గంలో గులాబీ జెండాను ఎగరవేయడం, కారు గుర్తు విజయానికి కృషి చేయడం. పార్టీ అధిష్ఠానం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని గౌరవిస్తూ, అధికారికంగా నియమించబడిన నియోజకవర్గ ఇన్చార్జి గండ్ర వెంకట రమణారెడ్డి నాయకత్వంలో సమిష్టిగా ముందుకు సాగితేనే పార్టీ మరింత బలపడుతుంది కాబట్టి ఆ దిశగా పనిచేద్దామని కోరారు.

# జామా మజీద్ ఇమాంపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించం

## ఇమామ్ రూహుల్ అమీన్ వెనకే నమాజు చదివిన వారే తనని క్రిమినల్ అనడం బాధాకరం

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 27 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో శనివారం రోజున కొందరు ప్రెస్ మీట్ పెట్టి జామా మజీద్ ఇమామ్ అయిన షేక్ రూహుల్ అమీన్ పై క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆరోపణలు చేశారని ఇట్టి సత్యదూర ఆరోపణలను మా మజీద్ కమిటీ సభ్యులు మరియు స్థానిక ముస్లిం నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూహుల్ అమీన్ 20 సంవత్సరాలకు పైగా హుస్నాబాద్ లో కుటుంబంతో జామా మజీద్ లో ఇమామ్ గా ఇక్కడే నివాసం ఉంటున్నారని వారికి రేషన్ కార్డు ఓటు హక్కు కలిగి ఉన్నారని వారి పిల్లలు కూడా స్థానికంగా హుస్నాబాద్ లోనే విద్యను అభ్యసించారని తెలిపారు. వీరిని స్థానికులు కాదనడం హాస్యాస్పదం అని,గతంలో వారిపై ఫాల్స్ కేసు ఒకటి నమోదు అయిన తర్వాత ఏలాంటి తప్పుడు నిరూపణ కాకపోవడముతో 2023లో గౌరవ కోర్టు కొట్టి వేయడం జరిగిందని,ఒక వ్యక్తి ఏదైనా నేరం చేసి నేరం రుజువైె అతను జైలుకు వెళ్తే అతను క్రిమినల్ గా పరిగణిస్తారు కానీ ఎఫ్ ఐ ఆర్ నమోదైన వ్యక్తిని క్రిమినల్ అని



సంబోధించడం బాధాకరమన్నారు. మరియు అదే వ్యక్తి వెనుక వారు కూడా అల్లా కోసం ప్రార్థన చేశారన్నారు.ముఖ్యంగా షేక్ రూహుల్ అమీన్ ఇమామ్ గత ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అంబాల్ పూర్ ఖాజీ ఉండగానే వీరి ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో నిఖాలు నిర్వహించలేదా మరియు అబ్దుల్ మన్నాన్ నియమితులైన తర్వాత షేక్ రూల్ అమీన్ ని తీసుకువెళ్లి నిఖాలు నిర్వహించలేదా మరి అలాంటప్పుడు వారు నాయబ్ ఖాజీగా నియమితులు అయిన తర్వాత మీకు వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు.ఒకవేళ అబ్దుల్ మన్నాన్ నాలుగు సంవత్సరాల నుండి ఈ ప్రాంత ప్రజలకు సేవ చేస్తే ప్రజలు వారిని గౌరవిస్తారు లేదా కొత్త వారిని ఆదరిస్తారు అలాంటప్పుడు మీకు ఎందుకు భయమన్నారు. మీరు నిర్వహించిన ప్రెస్ మీట్ లో మీ కుటుంబ సభ్యులే తప్ప కమిటీ సభ్యులు ఎవరున్నారని ప్రశ్నించారు. ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఇకనైనా ఇతరులను భయభ్రాంతులను గురిచేయడం మానుకోవాలని హుస్నాబాద్ డివిజన్ ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు. మీరు అధ్యక్షులుగా ఉన్న మసీదులో రంజాన్ తరాబీలు మీ కుమారుని తిరస్కరించి వేరే హాఫీజ్ ను తెచ్చుకొని నమాజు నిర్వహించలేదా ఇకనైనా మీ కుటుంబ పాలన విడనాడి ప్రజలతో కలిసి నడవాలన్నారు. మరోసారి జామా మజీద్ ఇమామ్ పై అవాకులు చవాకులు మాట్లాడితే సహించమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జామా మజీద్ అధ్యక్షులు భాషమియా, ప్రధాన కార్యదర్శి ఎండి హసన్, ఉపాధ్యక్షులు ఫసియోద్దీన్, ఎండి షబ్బీర్ ఎండి అయూబ్ ఎండి సాజిద్, సయ్యద్ ఇంతియాజ్,యండి అఫ్జల్ పాషా, ఎండి రహీం, ఎండి ఫయాజ్, ఎండి అష్రఫ్, కమిటీ సభ్యులు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్‌నినో సవాల్‌ను శాస్త్రీయ సాగుతో ఎదుర్కొందాం

**- సాదుల పవన్ కుమార్**

**మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్**

నంగునూరు, జులై 27 విజన్ ఆంధ్ర: ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ సూచించారు.

సోమవారం నంగునూరు రైతు వేదికలో నిర్వహించిన విత్తన మేళా ను ఆయన సందర్శించి రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు.

నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించాలని, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలను పాటిస్తూ శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపడితే మెరుగైన దిగుబడులు సాధించడంతో పాటు నష్టాలను కూడా తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. విత్తనాల ఎంపికలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షపాతం తగ్గితే పంటలపై పడే ప్రభావం, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు.

ఈ కార్యక్రమంలో నంగునూరు మండలానికి చెందిన రైతులు, విత్తన డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. విత్తన మేళా ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## గురుకుల హాస్టల్ ను సందర్శించిన మున్సిపల్ చైర్పర్సన్

**--కూలిపోయిన హాస్టల్ ప్రహరీ గోడను పరిశీలించిన చైర్పర్సన్.**

**--హాస్టల్ విద్యార్థులతో కలిసి చైర్పర్సన్ భోజనం.**

**--విద్యార్థుల భద్రతపై సిబ్బందికి పలు సూచనలు.**

తాండూరు (వికారాబాద్ జిల్లా) మైనారిటీ గురుకుల హాస్టల్ ను మున్సిపల్ చైర్ పర్సన్ నీరాజ బాల్రెడ్డి సందర్శించారు. పట్టణ పరిధిలోని హైదరాబాద్ రోడ్డు మార్గం లో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన వెనుక వైపు ప్రహరీ గోడ కూలిపోడం పై హోల్ చైర్ పర్సన్ నీరజ బాల్రెడ్డి హాస్టల్ లో సందర్శించి కూలిపోయిన వారి గూడెం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ వెంటనే ప్రహరీ గోడ నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం హాస్టల్ పరిసరాలను తనిఖీ చేసి, విద్యార్థుల భద్రతకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులతో చైర్‌పర్సన్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని హాస్టల్ యాజమాన్యంకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రజాక్ భాయ్, స్థానిక వార్డు కౌన్సిలర్ జావిద్ తదితరులు పాల్గొన్నారు.



## మృతిరాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మర్కూక్ మండల మాజీ ఎంపిపి పాండు గౌడ్

**-సర్పంచ్ భవాని బాలకిషన్**

**-మర్కూక్ మండల బీసీసెల్ అధ్యక్షులు కనకయ్య ముదిరాజ్**



మర్కూక్ జులై 27,(విజన్ ఆంధ్ర ) : ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం సమాజ బాధ్యతని మర్కూక్ మండల మాజీ ఎంపీపీ తాండ పాండు గౌడ్ అన్నారు. ఇటీవల అనారోగ్య కారణాల వల్ల మృతిచెందిన రాజంగారి సత్తెమ్మ కుటుంబానికి స్థానిక ప్రజాప్రతినిధులు మాజీ ఎంపిపి పాండు గౌడ్, స్థానిక సర్పంచ్ భవాని బాలకిషన్, మర్కూక్ మండల బీసీసెల్ అధ్యక్షులు మ్యాకల కనకయ్య ముదిరాజ్, గ్రామ పెద్దలు, దాతలు కలిసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి బాధను పంచుకున్నారు. కుటుంబం ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం అందించాలన్నారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట కర్రోల్ల నర్సింలు, దుబ్బాసి బాలయ్య, శ్రీగిరిపల్లి కృష్ణ ,మాజీ యూత్ ప్రెసిడెంట్ కుమ్మరోళ్ళ కర్ణాకర్, రాజంగారి దేవయ్యా ,యముడాల లక్ష్మణ్ ,బిక్షపతి, నర్సింలు, గిద్దెల బిక్షపతి, కొండనోళ్ళ నరేష్, కొండనోళ్ళ ప్రశాంత్ లు ఉన్నారు.

## బొమ్మారెడ్డిగూడెంలో జలసిరి కార్యక్రమంలో పంటకుంటల పనులకు శ్రీకారం

చౌటకూర్, జూలై 27 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండలంలోని బొమ్మారెడ్డిగూడెం గ్రామంలో సోమవారం జలసిరి కార్యక్రమంలో భాగంగా వీబీజీ రామ్జీ ఉపాధి హామీ పథకం కింద పంటకుంటల నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చౌటకూర్ మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ జైపాల్ నాయక్ మాట్లాడుతూ, వర్షపు నీటిని నిల్వ చేసేందుకు, భూగర్భ జలమట్టాన్ని పెంచేందుకు, అలాగే వర్షాభావ పరిస్థితుల్లో పంటలకు అవసరమైన నీటి సౌకర్యం కల్పించడంలో పంటకుంటలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం చేపడుతున్న జలసిరి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ కుమ్మరి కృష్ణతో పాటు గ్రామ ప్రజలు, రైతులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## తొర్రూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**మండలంలో ఐదు కోట్ల నిధులతో అభివృద్ధి పనులు**



తొర్రూర్ జులై 28 (విజన్ ఆంధ్ర) : తొర్రూర్ మండలం లోని గ్రామాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి. మండలంలోని గుడిబండ తండా, నాంచారి మనూర్, వెళికట్టే, పెద్ద మంగ్యాతండా, వెంకటాపురం, అమర్ సింగ్ తండా, దుబ్బ తండ, చీకటాయపాలెం, పత్తేపురం, పోలేపల్లి, ఎస్ వి కే తండా, గుర్తురు, ఖానాపురం, హచ్చుతండా కొమ్మనపల్లి తండా,ల గ్రామ పంచాయతీలలో గ్రామపంచాయతీ భవనాలు సిసి రోడ్లు మహిళా భవనాలకు శంకుస్థాపనలు చేసినారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ, మండలంలోని అన్ని ప్రాంతాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ప్రజల సౌకర్యార్థం రవాణా గ్రామపంచాయతీ భవనాలు మహిళా భవనాలు నిర్మాణం చేస్తామని ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వాటికి అనుగుణంగా ప్రజా పాలన కొనసాగిస్తాను అని అన్నారు. ఎమ్మెల్యే వెంట తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ తూణం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమ రజని రాజశేఖర్, తొర్రూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముద్దసాని సురేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హామ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షులు మోత్కూరి రవీంద్ర చారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల కుమార్, మడుపల్లి మాజీ ఎంపీటీసీ మహబూబ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల సర్పంచులు వార్డ్ మెంబర్లు నాయకులు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# అల్లా దయతో అందరూ సుభిక్షంగా ఉండాలి

**-తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.**

**-ఘనంగా ప్రారంభమైన ముర్షద్ దర్గా ఉర్సు ఉత్సవాలు.**

**-ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్ పలువురు ప్రముఖులు**




తాండూరు, జులై 27: (విజన్ ఆంధ్ర)తాండూరు పట్టణంలో ప్రఖ్యాతిగాంచిన ముర్షద్ దర్గా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి దర్గాలోని దర్గా సమాధిపై పూలు చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన 'జల్సా-ఎ-సీరత్-ఎ-ఔలియా' కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ అల్లా దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ముర్షద్ దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. ఉత్సవాలు సోదరభావానికి ప్రతీక ముర్షద్ దర్గా ఉత్సవాలని అన్నారు. ఇక్కడికి కుల మతాలకతీతంగా పెద్ద ఎత్తున ఉత్సవాలకు ప్రజలు తరలి వస్తారని అల్లా దయతో సర్వం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు నాగరాజ్, కౌన్సిలర్లు

నిర్వాహకులు ముతవల్లి అల్హాజ్ సయ్యద్ అబ్దుల్ గనిపాషా, దర్గాలో హజ్రత్ సయ్యద్ అబ్దుల్ కరీం పాషా, సలీం పాషా, వాలీపషా, సాహెబ్ ఖిబ్లా చిష్తి ఖలందరి మిర్జాయి రహమతుల్లా, షరీఫ్‌తో, హజ్రత్ సయ్యద్ అబ్దుల్ సలాం పాష సాహెబ్ చిష్త, పట్టణ ప్రముఖులు మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడిన ఇటుక బట్టీల కార్మికునికి మానవత్వం చాటుకున్న నాయకులు

**స్థానిక కౌన్సిలర్ పదివేల రూపాయల ఆర్థిక సహాయం,బిఆర్ఎస్ నాయకుని ఇరవైవేల నిత్యావసర సరుకులు అందచేత**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 27 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఒకటో వార్డులో మంద సదానందం అను ఇటుక బట్టి కార్మికునికి గత మూడు నెలల కింద బైక్ యాక్సిడెంట్ కాగా వారి కుటుంబానికి బిఆర్ఎస్ మాజీ ఏఎంసి డైరెక్టర్ కూతాటి విజయభాస్కర్ ఇరవైవేల విలువగల ఇంటి సరుకులు అందించి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీల్లో లెబర్‌గా పనిచేస్తున్న నిరుపేద కుటుంబమైన మంద సదానందంకు గత మూడు నెలల కింద బైక్ యాక్సిడెంట్ కాగా నేనున్నానంటూ గత మూడు నెలలుగా వారి బాగోగులు చూసుకుంటూ కుటుంబానికి పెద్దన్న దిక్కై ఇంటికి సరిపడా సరుకులతో పాటు హాస్పిటల్ ఖర్చులు కూతాటి విజయభాస్కర్ భరిస్తూ అన్ని తానే కుటుంబానికి నేనున్నానంటూ వారి అవసరాల నిమిత్తం మూడు నెలలకు ఇంటికి సరిపడా ఇరవై వేల విలువగల నిత్యవసరసరుకుల ను అందజేశారు. తన ఔదార్యాన్ని చూసి పలువురు భాస్కర్ ను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి 1వ వార్డు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**ఒకటవ వార్డు కౌన్సిలర్ అనూషసాగర్ బాధిత కుటుంబానికి పదివేలరూపాయల ఆర్థిక సాయం**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఒకటవ వార్డులో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మంద సదానందంని పరామర్శించి పదివేల ఆర్థిక సహాయం ఒకటవ వార్డు కౌన్సిలర్ చెన్నబోయిన అనూష విద్యాసాగర్ లు అందచేశారు.సదానందం కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి తన సొంత నిధులతో పదివేల రూపాయలు అందించారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి,హుస్నాబాద్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.వి రమణ ,మహిళ నాయకురాలు బోనగిరి రజిత,సీనియర్ కాంగ్రెస్ నాయకులు సింగరి, ఎన్ఎస్ యుఐ పట్టణ అధ్యక్షుడు కూన విశ్వతేజ మరియు ఒకటవ వార్డు యువ నాయకులు సావుల వెంకటో,సావుల మధు, కాటుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు. రాజకీయాల అతీతంగా సహాయం అందించడం మానవత్వానికి నిదర్శనమన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులు లబ్ధి పొందాలి

వర్షాభావ పరిస్థితులు కొనసాగే అవకాశం ఉన్నందున నీటి వినియోగం తక్కువగా ఉండే పప్పుధాన్యాలు, పత్తి, కూరగాయలు, ఆయిల్‌పామ్ వంటి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. రాయితీ విత్తనాలు, ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు కార్డులు అందజేస్తామని తెలిపారు. గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు సమావేశాలు నిర్వహించి ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తారని చెప్పారు. రైతులు తమ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులు పొందాలని కోరారు.

## మరిపెడ మండల పరిధిలోని తండాలలో ఉచిత వైద్య శిబిరాలు..

- వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి..
- 155 మందికి ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ..
- వర్షాకాల వాతావరణంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలి..



మరిపెడ, విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలోని ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా తండాలలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించినట్లు మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి తెలిపారు. తానంచెర్ల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని అజ్మీరా తండా గ్రామపంచాయతీలో, మరియు వీరారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని దంట కుంట తండా గ్రామపంచాయతీలో డాక్టర్ రవి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపులు జరిగాయి. ఈ శిబిరాలలో మొత్తం 155 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ముఖ్యంగా బీపీ (రక్తపోటు), షుగర్ (మధుమేహం), మరియు జ్వరంతో బాధపడుతున్న వారికి తగిన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రవి మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారానే దోమల నివారణ మరియు వ్యాధుల అదుపు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ప్రజలకు అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వామి,హెల్త్ సూపర్వైజర్ ఆచార్యులు, ఎమ్ ఎల్ ఎచ్ పీ ఝాన్సీ, ఏఎన్ఎంలు రోజమణి, శ్రీలత, ఆశా కార్యకర్తలు, మరియు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని శిబిరాలను విజయవంతం చేశారు.

## బలవంతపు వసూళ్లకు పాల్పడిన నిందితుల అరెస్ట్ - రిమాండ్

- హాస్టల్ వార్డెన్‌ను బెదిరించి పలుమార్లు డబ్బులు వసూలు చేసిన ఇద్దరు నిందితుల అరెస్ట్
- డబ్బులు ఇవ్వకపోతే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరింపులు
- ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్




ఉట్నూర్, జులై 27, (విజన్ ఆంధ్ర) :ఉట్నూర్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల హాస్టల్ వార్డెన్ నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసి, మరింత డబ్బు ఇవ్వాలని బెదిరించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళితే, ఉట్నూర్ ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాల హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్న ఫిర్యాదుదారుని వద్దకు గత కొద్ది రోజులుగా నిందితులు ఫోన్ కాల్స్ చేసి ఒక కార్యక్రమం పేరుతో డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తూ, ఈ నెల 26వ తేదీన హాస్టల్‌కు వెళ్లిన నిందితులు రూ.5,000 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఇవ్వకపోతే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించి పదేళ్లు జైలుకు పంపిస్తామని బెదిరించారు. గత ఆరు నెలల్లో ఇదే విధంగా రెండు సార్లు రూ.3,000 చొప్పున మొత్తం రూ.6,000 వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు ఉట్నూర్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుల ప్రమేయం నిర్ధారణ కావడంతో వారిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది. అరెస్టు చేసిన నిందితులు నేతావత్ రాందాస్ (53) s/o శ్రీ దివంగత రూప్లా, పాత ఉట్నూర్, నేతావత్ జైల్‌సింగ్ (28) s/o శ్రీ రాందాస్ నాయక్, పాత ఉట్నూర్. బెదిరింపులు, బలవంతపు వసూళ్లు (ఎక్స్‌టార్షన్) వంటి నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ సీఐ ఎం. ప్రసాద్ హెచ్చరించారు. ప్రజలు ఎవరైనా బెదిరింపులకు గురైనట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

## సేవా కార్యక్రమాల్లో 320 బి జిల్లా ఆదర్శం

- లయన్స్ ఇంటర్నేషనల్ 320 బి జిల్లా నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకారం
- జిల్లా గవర్నర్‌గా శైలజా నాయర్ బాధ్యతల స్వీకారం
- ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా అవంతి రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా చల్లా శ్రీనివాస్ రెడ్డి
- కొంపల్లిలో ఘనంగా 11వ క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం
- నేత్రదానంపై ప్రత్యేక పోస్టర్ ఆవిష్కరణ
- సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని పిలుపు

కొంపల్లి, జులై 27 (విజన్ ఆంధ్ర): లయన్స్ ఇంటర్నేషనల్ 320 బి జిల్లా చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉండటమే కాకుండా ఇతర లయన్స్ క్లబ్‌లకు సైతం ఆదర్శంగా నిలుస్తున్నాయని పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ (పీఐడీ) లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు అన్నారు. కొంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన లయన్స్ ఇంటర్నేషనల్



320 బి జిల్లా 11వ క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 320 బి జిల్లా నూతన గవర్నర్‌గా శైలజా నాయర్, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా అవంతి రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా చల్లా శ్రీనివాస్ రెడ్డితో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఐడీ లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు మాట్లాడుతూ, జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టిన శైలజా నాయర్ సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు కలిగిన వ్యక్తి అని కొనియాడారు. ఆమె నాయకత్వంలో జిల్లాలోని అన్ని లయన్స్ క్లబ్‌లు మరింత చురుకుగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నేత్రదానంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించే లక్ష్యంతో రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేత్రదానం ద్వారా పలువురికి వెలుగునిచ్చే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ఈ మహోన్నత కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టాలేషన్ చైర్మన్ హలోక్ కుమార్ జా, మాజీ జిల్లా గవర్నర్లు సెల్వ సాయిరాం రాజు, రాజేంద్ర ప్రసాద్, ఎస్.ఎన్. రెడ్డి, దీపక్ భట్టాచార్య, విద్యాసాగర్ రావు, విజయ్ కుమార్ శెట్టి, మోహన్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ హేమల్ కన్విద్‌తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు, సేవాభావం కలిగిన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతు వేదికలో విత్తన మేళా...

కుకునూరుపల్లి, జులై 27,విజన్ ఆంధ్ర : ఎల్నినో ప్రభావంతో వర్షపాతం, అనిశ్చితి వలన తక్కువ నీటి అవసరం ఉన్న పంట సాగు ను ప్రోత్సహించేందుకు సోమవారం కుకునూరుపల్లి రైతువేదికలో విత్తన మేళా నిర్వహించారు. కంది, పెసర, మినుము, జొన్న , అలసంద, విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏడిఏ బాబు నాయక్, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ వీరుపాక శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓమహబూబ్ అలీ , ఎంపివో నాగభూషణం, వ్యవసాయ అధికారి గోవిందరాజు, ముద్దాపూర్ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, ఏఈ వో లు స్థానిక సర్పంచ్ మల్లం కనకవ్వ ఐలయ్య, విత్తన డీలర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాధుల్ నగర్ గ్రామంలో sir సమగ్ర ఓటర్ నమోదు కార్యక్రమంపై

హత్నూర డిప్యూటీ ఎమ్మార్వో నరేందర్ రావు ఆధ్వర్యంలో

# గ్రామసభ

విజన్ ఆంధ్ర హత్నూర : హత్నూర మండల్ సాదుల నగర్ గ్రామంలో సోమవారం నాడు ఆఖతీ సమగ్ర ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా హత్నూర మండల్ డిప్యూటీ ఎమ్మార్వో నరేందర్ రావు మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రామంలో పూర్తిస్థాయిలో ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తికాలేనందున సదుల నగర్ గ్రామ సర్పంచ్ లక్ష్మి కృష్ణ ఆధ్వర్యంలోగ్రామసభ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు ఈ సందర్భంగా డిప్యూటీ ఎమ్మార్వో నరేంద్రరావు మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటును వినియోగించుకునే అవకాశం నాలుగో తారీఖు లోపు వారి పూర్తి డాటా గ్రామ బి ఎల్ ఓ కు తెలుపాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి తో పాటు సదుల్ నగర్ గ్రామ సర్పంచ్ లక్ష్మి కృష్ణ మాజీ సర్పంచ్ భాస్కర్ గౌడ్ ఉప సర్పంచ్ అశ్విని ప్రసాద్ బి ఎల్ ఓ మంజుల మాజీ గ్రామపంచాయతీ సభ్యులు వనరి గారి వీరేశం గడ్డం రామరాజు తలారి భాస్కర్ మంజుల సుజాత గ్రామపంచాయతీ సభ్యులు నాగరాజు శేఖర్ గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు

## సీఐ వీరబాబును కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**- శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మార్పీఎస్ నందిగామ మండల అధ్యక్షులు చెన్నగళ్ల అశోక్.**

నందిగామ:జులై 27(విజన్ ఆంధ్ర న్యూస్) ; రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పోలీస్ స్టేషన్ నూతన సీఐగా భాద్యతలు చేపట్టిన సిఐ వీరబాబు ను ఎమ్మార్పీఎస్ నందిగామ మండల అధ్యక్షుడు చెన్నగాళ్ల అశోక్ మరియు నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నందిగామ మండల కోఇంచార్జి సాయి, నాయకులు బొమ్మగళ్ల రమేష్,బొమ్మగళ్ల నర్సింహా,బుడ్డమోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ఎంపీ వైద్యానికి మూడేళ్ల చిన్నారి బలి...!

మరిపెడ, విజన్ ఆంధ్ర : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సరైన అర్హతలు లేని ఆర్ఎంపీ చేసిన వైద్యం వికటించడంతో మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఘటనకు బాధ్యుడైన ఆర్ఎంపీ క్లినిక్‌కు తాళం వేసి పరారైనట్లు బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడలోని వాటర్ ప్లాంట్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న బల్యూరి సురేష్, రేణుక దంపతుల మూడేళ్ల కుమారుడు నాని గత శనివారం నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో ఆదివారం బాలుడిని మరిపెడలోని 'ప్రజత్ క్లినిక్'కి కు తీసుకెళ్లగా, అక్కడ ప్రథమ చికిత్స అందించే కాంపాటి రవి బాబు అనే ఆర్ఎంపీ బాలుడికి ఇంజెక్షన్ ఇచ్చి, కొన్ని మందులు రాసి ఇంటికి పంపించాడు. అయితే సాయంత్రానికి కూడా బాలుడి ఆరోగ్యంలో ఎలాంటి మార్పు కనిపించకపోగా పరిస్థితి మరింత విషమించింది. దీంతో తల్లిదండ్రులు మరోసారి అదే క్లినిక్‌కు తీసుకెళ్లగా, ఆర్ఎంపీ మరో ఇంజెక్షన్ ఇచ్చాడు. ఆ ఇంజెక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే బాలుడి కడుపు ఉబ్బిపోవడంతో పాటు ఊపిరి ఆడక అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు బాలుడి పరిస్థితిపై ఆర్ఎంపీని ప్రశ్నించగా, వెంటనే పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు. అత్యవసరంగా డబ్బులు సమకూర్చుకుని ఆసుపత్రికి తరలించేలోపే బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. తమ బిడ్డ మృతికి కారణమేంటని ప్రశ్నించేందుకు తిరిగి క్లినిక్‌కు వచ్చిన



తల్లిదండ్రులకు షాక్ ఎదురైంది. అప్పటికే ఆర్ఎంపీ కాంపాటి రవి బాబు క్లినిక్‌కు తాళం వేసి అక్కడి నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల కథనం ప్రకారం, ఇదే ఆర్ఎంపీ నిర్లక్ష్య వైద్యం కారణంగా గతంలో ఉల్లేపల్లి గ్రామానికి చెందిన ఓ చిన్నారి కూడా మృతి చెందిన ఘటనలో కేసులు నమోదయ్యాయని ఆరోపిస్తున్నారు. అయినప్పటికీ అతను తిరిగి క్లినిక్ నిర్వహిస్తూ మరోసారి నిర్లక్ష్యానికి పాల్పడ్డాడని వారు మండిపడుతున్నారు.

పేద కుటుంబానికి చెందిన తమ కుమారుడి మృతికి కారణమైన ఆర్ఎంపీపై కఠిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని బాలుడి తల్లిదండ్రులు సురేష్, రేణుక అధికారులను వేడుకుంటున్నారు. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కుత్బుల్లాపూర్‌కు రూ.270 కోట్ల రహదారి వరం

**కొంపల్లి--బహదూర్‌పల్లి, గండి మైసమ్మ--మియాపూర్ రహదారుల పనులపై మంత్రి శ్రీధర్ బాబు సమీక్ష**

**-రూ.270 కోట్లతో రెండు ప్రధాన రహదారి ప్రాజెక్టులకు వేగం**

**-అటవీ శాఖ అనుమతుల జాప్యం తొలగించి పనులు ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**-పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం**

**-ప్రజలకు మెరుగైన రవాణా.. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం**

**-రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

కుత్బుల్లాపూర్, జులై 27 (విజన్ ఆంధ్ర) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రూ.270 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సోమవారం సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం ప్రాజెక్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, నిర్మాణ పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్తో కలిసి కొంపల్లి--బహదూర్‌పల్లి రహదారి విస్తరణ పనులకు రూ.130 కోట్లు, గండి మైసమ్మ--మియాపూర్ రహదారి నిర్మాణానికి రూ.140 కోట్లు వెచ్చిస్తూ మొత్తం రూ.270 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమగ్రంగా చర్చించి, పనుల అమలు తీరుపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, గత దశాబ్ద కాలంగా అటవీ శాఖ అనుమతులు లభించక ఈ రహదారి పనులు నిలిచిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన అనుమతులు వేగంగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుని పనులను ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, జిల్లా కలెక్టర్ మను చౌదరి, సీఎంసీ కమిషనర్ సృజన, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హనుమంత్ రెడ్డి, భూపతి రెడ్డి, బొంగునూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ కుమార్ దీపక్

## ఓటరు జాబితా, భూభారతి దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని ఆదేశం

బెల్లంపల్లి, జులై 27 విజన్ ఆంధ్ర బెల్లంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మండల తహసీల్దార్ కృష్ణతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ, సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సులకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ప్రజల నుంచి సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు ఇంకా సమర్పించని ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించి బూత్ స్థాయి అధికారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులతో సరిపోల్చి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## 15వ వార్డులో రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

బెల్లంపల్లి, జూలై 27 విజన్ ఆంధ్ర : బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని టేకులబస్తి 15వ వార్డులో నూతన రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. వార్డు కౌన్సిలర్ చింతల వసంత తో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి.. ఈ సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చైర్ పర్సన్ కౌన్సిలర్ తెలిపారు. టేకులబస్తిలో ఎంతోకాలంగా ప్రజలు ఎదురుచూస్తున్న రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి, నాయకులు రమేష్ బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, 23వ వార్డు కౌన్సిలర్ జంగం కల్పన లను వార్డు కౌన్సిలర్ చింతల వసంత శాలువాలతో సన్మానించారు., టీపీసీసీ జిల్లా కన్వీనర్ దేవసాని ఆనంద్, టేకులబస్తి వార్డు ఇన్‌చార్జి కన్నూరి వెంకటేష్, ఎస్ఐఆర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎండీ ఖాజాపాషా, మాజీ ఏఎంసీ డైరెక్టర్ దెబ్బేటి రమేష్, కన్నూరి రాజలింగు, రమాకాంత్, బి.వంశీ, లక్ష్మణ్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సదాశివపేట మండలంలో ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ ముగింపు

విజన్ ఆంధ్ర : సదాశివపేట : సదాశివపేట మండలంలో పనిచేస్తున్న ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. మండలంలోని ఉపాధ్యాయులందరినీ రెండు గ్రూపులుగా విభజించి, ప్రతి గ్రూపుకు మూడు రోజుల చొప్పున శిక్షణను సదాశివపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.

సోమవారం రెండవ గ్రూప్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి కోర్స్ డైరెక్టర్ ఐన మండల విద్యాధికారి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న నూతన బోధనా పద్ధతులను తమ పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం ఇటీవల జీవితకాల సాఫల్య పురస్కారం అందుకున్న మండల విద్యాధికారి శ్రీ శంకర్ ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని యూసుఫ్, సురేష్, ప్రవీణ్, పద్మ గార్లు ఆర్.పి లుగా వ్యవహరించి సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఐలయ్య శస్త్ర చికిత్సపై సంతృప్తి

మందమర్రి, జూలై 27 (విజన్ ఆంధ్ర) : ఇటీవల రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో టోటల్ హిప్ రీప్లేస్మెంట్ పూర్తి చేసుకున్న ఐలయ్య శస్త్ర చికిత్సపై కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆసుపత్రి డీవైసీఎంవో మధు కుమార్ పేర్కొన్నారు. శస్త్ర చికిత్స సమయంలో ఐలయ్యకు వేసిన కుట్లను వైద్యుల సమక్షంలో సోమవారం తొలగించి నడిపించినట్లు తెలిపారు. అనుభవం కలిగిన వైద్యుల సహకారంతో అత్యాధునిక ఆర్థోపెడిక్ వైద్య సేవలు కార్మిక కుటుంబసభ్యులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్థోపెడిక్ వైద్యులు సుహాసిని,నరేష్,అనస్థీషియా మధుకర్,ఓటి ఇంచార్జ్ జ్యోతి,సిబ్బంది సమిష్టిగా కృషి చేశారని ఆయన గుర్తు చేశారు.



# ఓటరు జాబితా సవరణ మనందరి బాధ్యత

- చింతల్ డివిజన్‌లో ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో మహ్మద్ రఫీ పిలుపు
- అర్హులైన ప్రతి ఒక్కరూ గణన పత్రాలను తప్పనిసరిగా సమర్పించాలి
- నిర్ణీత గడువులోపు బూత్ స్థాయి అధికారికి వివరాలు అందజేయాలి
- ఓటరు జాబితాలో పేరు నమోదు ప్రజాస్వామ్య హక్కు: మహ్మద్ రఫీ
- ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో విస్తృత అవగాహన అవసరం
- చంద్రానగర్‌లో నిర్వహించిన ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి విశేష స్పందన
- కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు



కుత్బుల్లాపూర్, జూలై 27 (విజన్ ఆంధ్ర): ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది వంటిదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు అయ్యేలా బాధ్యతగా వ్యవహరించాలని మహ్మద్ రఫీ పిలుపునిచ్చారు. చింతల్ డివిజన్ పరిధిలోని చంద్రానగర్‌లో నిర్వహించిన ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. అర్హులైన ఓటర్లందరూ తమ గణన పత్రాలను పూర్తిగా నింపి, నిర్ణీత గడువులోపు సంబంధిత బూత్ స్థాయి అధికారికి అందజేయాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అర్హత ఉన్న ఏ ఒక్కరి పేరు కూడా జాబితాలో లేకుండా ఉండకూడదని ఆయన అన్నారు. ప్రతి కుటుంబం తమ వివరాలను సరిచూసుకొని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెహెర్ ఉన్నీసా బేగం, రాములు, సాంబరాజు, నర్సింహా గౌడ్, హరి ప్రసాద్, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ, సూర్యప్రకాశ్, శంకర్, భాస్కర్ రెడ్డి, మహబూబ్, షబ్బీర్, సుశీల, మేఘమాల, విద్యాసాగర్, భాస్కర్, పాండరంగం, బూత్ స్థాయి అధికారులు శ్రీశైలం, అస్లం, ఉమామహేశ్వరి, విద్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

- మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్



చేవెళ్ల, జూలై 27 (విజన్ ఆంధ్ర) : ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అందుబాటులో ఉంచిన విత్తనాలను రైతులు వినియోగించుకుని ప్రత్యామ్నాయ పంటల సాగుకు ముందుకు రావాలి" అని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్ లాల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అనువైన విత్తనాలను అందించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోమవారం నుంచి మూడు రోజులపాటు చేవెళ్ల రైతు వేదికలో విత్తన మేళా నిర్వహిస్తున్నామని చెప్పారు. తక్కువ నీరు, తక్కువ కాలవ్యవధిలో పండే కందులు, పెసలు, మినుములు, ఆముదం, వివిధ రకాల కూరగాయల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఆసక్తి గల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నష్టాలను తగ్గించుకోవాలని శంకర్ లాల్ సూచించారు.

# జగద్గిరిగుట్ట ప్రభుత్వ పాఠశాలకు రక్షణ కల్పించాలి

- ...ప్రజావాణిలో సీపీఐ వినతి
- సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిక
- ప్రజావాణిలో జోనల్ అధికారులకు సీపీఐ వినతిపత్రం
- జగద్గిరిగుట్టలో రోడ్డు ఆక్రమణలు, అక్రమ పార్కింగ్ తొలగించాలని డిమాండ్
- ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ ఎత్తు పెంచాలని విజ్ఞప్తి
- గత ఫిర్యాదులపై స్పందించని అధికారుల తీరుపై ఆగ్రహం
- సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం కొనసాగితే ఉద్యమం తప్పదని హెచ్చరిక
- ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజావాణి లక్ష్యమని అధికారులకు గుర్తుచేసిన సీపీఐ



కుత్బుల్లాపూర్, జూలై 27 (విజన్ ఆంధ్ర): జగద్గిరిగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తగిన రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రాంతీయ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో అధికారులను కలిసి జగద్గిరిగుట్ట, గాజులరామారం డివిజన్లకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాన్ని ఈఈ గోవర్ధన్, బద్రి తదితర అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ, రెండు వారాల క్రితం నిర్వహించిన ప్రజావాణిలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌కు జగద్గిరిగుట్టలో రోడ్డు ఆక్రమణలు తొలగించడం, ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టడం, గాజులరామారం డివిజన్‌లో దెబ్బతిన్న రహదారులను మరమ్మతు చేయడం వంటి సమస్యలపై వినతిపత్రం సమర్పించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజావాణిలో ప్రజలు సమస్యలు వినిపించినా అధికారులు స్పందించకపోతే ఆ కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. జగద్గిరిగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ తక్కువ ఎత్తులో ఉండటంతో రాత్రి వేళల్లో, సెలవు దినాల్లో ఆకతాయిలు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించి విద్యా వాతావరణాన్ని దెబ్బతీస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ ఎత్తును పెంచి పాఠశాలకు పూర్తి రక్షణ కల్పించాలని అధికారులను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్య వైఖరి వీడకపోతే రానున్న రోజుల్లో ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథరావు, రాములు, యువజన సంఘం నాయకులు కీర్తి, ప్రవీణ్, ఇమామ్, జంబులు తదితరులు పాల్గొన్నారు.

# తాటిగూడలో మహిళా గ్రామసభ నిర్వహణ

**- పారిశుద్ధ్యం, తాగునీరు, మహిళా సాధికారతపై చర్చ**



బెల్లంపల్లి జూలై 27 విజన్ ఆంధ్ర : కాసిపేట మండలం తాటిగూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక మహిళా గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మహిళా సాధికారత, మహిళల హక్కులు, సంక్షేమ చట్టాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుదల, చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేందుకు మోటార్లు, హ్యాండ్‌పంపులను మరమ్మతు చేయాలని నిర్ణయించారు. వర్షాకాలంలో దోమల నివారణకు డ్రైనేజీల శుభ్రత, నిల్వ నీటి తొలగింపు, ఫాగింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళలు ప్రస్తావించిన స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ హామీ ఇచ్చారు.

ఈ సమావేశంలో ఉపసర్పంచ్ తమ్మినేడి విజయలక్ష్మి శ్యామ్‌శేఖర్, పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, వార్డు సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గజ్వేల్ రైతు వేదికలో ఎల్ నినో ప్రభావంపై అవగాహన సదస్సు, విత్తన మేళా

**- రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి**

**- రైతులకు ప్రభుత్వం ఉచితంగా డ్రిప్ - స్ప్రింక్లర్లు అందించాలి**

**- మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కార్ పద్మాబాయి నర్సింగరావు**

గజ్వేల్, 27 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో గల రైతు వేదికలో సోమవారం వాతావరణ మార్పులు మరియు ఎల్ నినో ప్రభావంపై మండల వ్యవసాయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సు, విత్తన మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్ కార్ పద్మాబాయి నర్సింగరావు హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎల్ నినో ప్రభావం వల్ల సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని, కాబట్టి రైతులు సాంప్రదాయ పంట విధానాన్ని మార్చుకుని, వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా ప్రభుత్వం అందించే సూచనలను పాటించాలని, నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి పంట సాగును ఈ సీజన్‌లో తగ్గించుకోవడం శ్రేయస్కరం అన్నారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకుని, తక్కువ నీటితో సమర్థవంతంగా పండే జొన్న, సజ్జ, కంది, పెసర, మినుము, నువ్వులు, వేరుశనగ, కూరగాయల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులకు అందుబాటులో విత్తనాలు ఉండేవిధంగా ప్రభుత్వం తేది 27 జూలై నుండి 29 జూలై వరకు రైతు వేదికలో లభిస్తాయి. కాబట్టి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షపు నీటిని వ్యర్థంగా పోనీయకుండా నిల్వ చేసుకోవాలని, సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా అత్యవసర సమయంలో పంటలకు నీటి ఎద్దడి రాకుండా చూసుకోవచ్చుని, సరైన నీటి యాజమాన్య పద్ధతులను పాటిస్తే ఎల్ నినో ప్రభావాన్ని సులభంగా అధిగమించవచ్చుని తెలిపారు. ముఖ్యంగా రైతులకు ఉచితంగా డ్రిప్ – స్ప్రింక్లర్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరి, నక్క సంతోషి రాములు, వ్యవసాయ శాఖ అధికారులు, వివిధ వార్డుల రైతులు పాల్గొని సదస్సును దిగ్విజయం చేశారు.

# మెదడు వ్యాధితో పోరాటం.. దాతల సాయం కోసం ఎదురు చూపు

చేవెళ్ల, జూలై 27 (విజన్ ఆంధ్ర) : చేవెళ్ల మున్సిపల్ పరిధి దామర గిద్ద వార్డుకు చెందిన జేజే ప్రవీణ్ కుమార్ గత మూడు నెలలుగా మెదడు సంబంధిత తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఇప్పటికే వైద్య చికిత్స కోసం కుటుంబ సభ్యులు లక్షల రూపాయలు వెచ్చించడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురై, చికిత్సను కొనసాగించలేని పరిస్థితిలో దవాఖాన నుంచి ఇంటికి తీసుకువచ్చారు. ప్రవీణ్ కుమార్‌కు తండ్రి లేకపోగా, కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న ఆయన తల్లికి గతంలో పక్షవాతం రావడంతో ఆమె ఆరోగ్యం కూడా బలహీనంగా ఉంది. అయినప్పటికీ మంచానికే పరిమితమైన కుమారుడికి సేవలందిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రవీణ్ కుమార్ పరిస్థితిని తెలుసుకున్న పలువురు దాతలు ముందుకు వచ్చి తమ వంతు సహాయాన్ని అందిస్తున్నారు. ఈ క్రమంలో చేవెళ్లకు చెందిన అవుసుల రాజు వైద్య చికిత్స నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేయగా, చేవెళ్ల మాజీ ఎంపీపీ విజయలక్ష్మిరమణారెడ్డి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించి కుటుంబానికి అండగా నిలిచారు. అయినప్పటికీ చికిత్స కొనసాగించేందుకు ఇంకా భారీ మొత్తంలో నిధులు అవసరమని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పెద్ద మనసున్న వారు తమ వంతు ఆర్థిక సహాయం అందించి ప్రవీణ్ కుమార్ ప్రాణాలను కాపాడాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. సహాయం చేయదలిచిన వారు కింది ఫోన్ నంబర్ 9000296094 లో సంప్రదించాలని వేడుకుంటున్నారు.

# చేవెళ్లలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌ను వెంటనే ప్రారంభించాలి

**- బిజెపి జిల్లా కార్యదర్శి కృష్ణ గౌడ్**

**- ఎంఈఓకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు**



చేవెళ్ల, జూలై 27 (విజన్ ఆంధ్ర): ప్రభుత్వం ప్రకటించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను చేవెళ్ల నియోజకవర్గంలో వెంటనే ప్రారంభించి పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి అని బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గౌండ్ల కృష్ణ గౌడ్ అన్నారు. సోమవారం బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మండల విద్యాధికారి (ఎంఈఓ)కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గౌండ్ల కృష్ణ గౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రకటించిన హామీల అమలులో జాప్యం తగదన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో ప్రతిపాదించిన ఈ విద్యాసంస్థను వెంటనే ప్రారంభించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన పరిపాలనా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేవెళ్ల ప్రజల ఆకాంక్షలను గౌరవించి పాఠశాల ఏర్పాటును వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ప్రజలను భాగస్వామ్యం చేసుకుని ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు, పత్తి సత్యనారాయణ, చేకూరి ప్రవీణ్ రెడ్డి, వెంకటేష్ పాగ, పీసరి శ్రీకాంత్ రెడ్డి, కాసుల నాగరాజు, అభిషేకర్ రెడ్డి. అగ్రవల్లి అశోక్. వడ్డే గణేష్, జయసింహారెడ్డి, పురుషోత్తం రెడ్డి, సామ కృష్ణారెడ్డి. రవి. మహేష్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

# 2015 అనుమతి పత్రాలపై అక్రమాల ఆరోపణలు...

**సమగ్ర విచారణకు మాజీ ఉపసర్పంచ్ డిమాండ్**

భీమదేవరపల్లి, జూలై 27(విజన్ ఆంధ్ర): ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీలో 2015 లో జారీ చేసినట్లు చెబుతున్న ఇంటి నిర్మాణ అనుమతి పత్రాలపై తీవ్ర అక్రమాలు జరిగాయని మాజీ ఉపసర్పంచ్ కొలుగూరి రాజు ఆరోపించారు. శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "కాలానికి ముందే రికార్డులు పరుగులు పెట్టాయా... లేక ఎవరి అతి తెలివి వాటిని అలా రాయించిందా?" అంటూ అనుమానం వ్యక్తం చేసిన ఆయన, 2016 అక్టోబర్ లో నూతన జిల్లాల ఏర్పాటు ద్వారా వరంగల్ అర్బన్ జిల్లా ఏర్పడగా, 2015లోనే వరంగల్ అర్బన్ జిల్లా పేరుతో గ్రామపంచాయతీ అనుమతి పత్రాలను తయారు చేసి ఇంటి నిర్మాణ అనుమతి పత్రం ఎలా జారీ అయ్యిందని ప్రశ్నించారు.

సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా పొందిన రికార్డుల ప్రకారం, 2015 నుండి 2018 వరకు రెండు మాత్రమే గ్రామపంచాయతీకి నిర్మాణ దరఖాస్తులు వచ్చాయని, ప్రస్తుతం వివాదంలో ఉన్న అనుమతికి సంబంధించిన దరఖాస్తు రికార్డుల్లో లేదని ఆయన ఆరోపించారు. ఆ అనుమతి పత్రాలతో 2024లో ఫీల్డ్ ఎంక్వయిరీ చేసిన గ్రామపంచయతీ అధికారి అక్కడ ఇల్లు లేకున్నా కూడా దానికి ఇంటి నెంబర్ ఇవ్వడం జరిగింది ఎలాంటి చర్య తీసుకోకుండా ఇంటి నెంబర్ ఇవ్వడం ద్వారా ఆ అనుమతి పత్రాన్ని ఆధారంగా చేసుకుని మాదుగుల లక్ష్మి తన స్థలాన్ని విక్రయించగా, అనంతరం మారేపల్లి సునీత పేరుతో రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలిపారు. అయితే భూమి రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలిపినారు ఆ రిజిస్ట్రేషన్ లో పేర్కొన్న దానికి సంబంధించిన మ్యాపు పై కూడా ఫోర్జరీ స్టాంపులు మరియు ఫోర్జరీ సంతకాలతో ఈ రిజిస్ట్రేషన్ పూర్తి చేశారు అని పేర్కొన్నారు ఈ వ్యవహారంలో గ్రామపంచాయతీ అనుమతులు, రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన అధికారులు లేదా సంబంధిత వ్యక్తులు ఎవరైనా ఉంటే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఉపసర్పంచ్ కొలుగూరి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులకు ప్రోత్సాహం

**- ముత్యంపల్లిలో విత్తన మేళా ప్రారంభం**

బెల్లంపల్లి జూలై 27 విజన్ ఆంధ్ర : వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టి నష్టాలను తగ్గించుకునేలా కాసిపేట మండలంలోని ముత్యంపల్లి రైతువేదికలో విత్తన మేళాను ప్రారంభించారు. ఈ మేళాలో రైతులకు కంది, పెసర, కూరగాయల విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ అందుబాటులో ఉంచారు.

ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు ప్రభాకర్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు, ఎరువులను రైతులు వినియోగించుకుని ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ముత్యంపల్లి సర్పంచ్ చాహకటి సుగుణ, ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, పీఏసీఎస్ చైర్మన్ తాటిపాముల శంకర్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్, ఉప సర్పంచ్ మల్లెతుల సందీప్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఊతూరి సత్తయ్య, పీఏసీఎస్ డైరెక్టర్లు, వ్యవసాయ విస్తరణ అధికారి సాగర్, రైతులు పాల్గొన్నారు.

# శంభీపూర్ ప్రభుత్వ కమ్యూనిటీ భవనాన్ని వెంటనే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్వాధీనం చేసుకోవాలి



దుండిగల్ ప్రజావాణిలో ఉప కమిషనర్‌కు ఆకుల సతీష్ బృందం వినతి

-ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనం ఇప్పటికీ ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని పరిస్థితి

-గత ఆరు సంవత్సరాల ఆదాయంపై ప్రత్యేక లెక్కల పరిశీలన చేపట్టాలని డిమాండ్

-అక్రమంగా అద్దెలు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణకు విజ్ఞప్తి

-చట్టవిరుద్ధంగా వసూలైన మొత్తాలను ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని సూచన

-ప్రభుత్వ ఆస్తిని స్వాధీనం చేసుకోకపోవడంపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

-పేద, మధ్యతరగతి కుటుంబాలకు కమ్యూనిటీ భవనం ఎంతో ఉపయోగపడుతుందని ఆకుల సతీష్ అభిప్రాయం

-ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి

దుండిగల్, జులై 27 (విజన్ ఆంధ్ర): శంభీపూర్ గ్రామంలోని సర్వే నంబరు 181లో ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని వెంటనే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్వాధీనం చేసుకుని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకుల సతీష్ బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు దుండిగల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఉప కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ హయాంలో ప్రజల అవసరాల కోసం నిర్మించిన ఈ ప్రభుత్వ కమ్యూనిటీ భవనం గ్రామ పంచాయతీ నుంచి దుండిగల్ పురపాలక సంస్థకు, అనంతరం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైనప్పటికీ ఇప్పటికీ అధికారికంగా కార్పొరేషన్ ఆధీనంలోకి రాకపోవడం విచారకరమన్నారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తి కొద్దిమంది ఆధీనంలో ఉండడం సమంజసం కాదని పేర్కొన్నారు. కమ్యూనిటీ భవనాన్ని కొందరు వ్యక్తులు, వారిలో కొందరు రాజకీయ నాయకులు కూడా ఉన్నారనే స్థానిక ఆరోపణల నేపథ్యంలో, వివాహాలు, శుభకార్యాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు అద్దెకు ఇస్తూ ఆదాయం పొందుతున్నారనే అంశంపై సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు. వాస్తవాలు నిర్ధారణైతే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఆరు సంవత్సరాలుగా కమ్యూనిటీ భవనం ద్వారా వచ్చిన ఆదాయంపై ప్రత్యేక లెక్కల పరిశీలన నిర్వహించి, చట్టవిరుద్ధంగా వసూలు చేసిన మొత్తాలను ప్రభుత్వ ఖజానాకు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ ఆస్తిని ఇంతకాలం స్వాధీనం చేసుకోకపోవడానికి గల కారణాలపై విచారణ జరిపి, పరిపాలనా నిర్లక్ష్యం లేదా బాధ్యతా రాహిత్యం తేలితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమ్యూనిటీ భవనాన్ని స్వాధీనం చేసుకున్న అనంతరం పారదర్శక విధానంలో నిర్వహిస్తూ ఐదు వేల రూపాయల అద్దెతో ప్రజలకు అందుబాటులో ఉంచితే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందని ఆకుల సతీష్ పేర్కొన్నారు. వివాహాలు, నామకరణాలు, ఇతర సామాజిక కార్యక్రమాలను తక్కువ వ్యయంతో నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా శంభీపూర్ ప్రభుత్వ కమ్యూనిటీ భవనాన్ని వెంటనే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధీనంలోకి తీసుకొని ప్రజలకు అందుబాటులో ఉంచాలని, ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ నిర్వహించి చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ బృందం ఉప కమిషనర్‌ను కోరింది. ఈ కార్యక్రమంలో పి.బి. శ్రీనివాస్, ఎల్ల స్వామి, అంకం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

---

# మియాపూర్ రహదారి విస్తరణకు శ్రీకారం

**-బౌరంపేట ఇందిరాగాంధీ విగ్రహం నుంచి కోకా-కోలా కంపెనీ వరకు రహదారి విస్తరణ**

**-అటవీ భూమి పరిధిలో పనులకు అధికారులతో సమీక్ష**

**-భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు**

**-ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలే ప్రభుత్వ లక్ష్యం**

దుండిగల్, జులై 27 (విజన్ ఆంధ్ర); :దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట ఇందిరాగాంధీ విగ్రహం నుంచి కోకా-కోలా కంపెనీ వరకు ఉన్న మియాపూర్ రహదారి (అటవీ భూమి పరిధి)లో చేపట్టనున్న రహదారి విస్తరణ పనులను రాష్ట్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి ఇరువైపులా చేపట్టనున్న విస్తరణ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి, నగర అభివృద్ధి, పెరుగుతున్న వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థను అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. శ్రీజన (ఐఏఎస్), కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ (ఐఏఎస్), డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, ప్రముఖులు కొలను హనుమంతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, భూపతి రెడ్డి, పీసరి మహేందర్ రెడ్డి, బొంగునూరి కిషోర్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యూఎం) అన్వేష్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, ఏసీపీ శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్ సురేందర్ నాయక్, అశోక్ కుమార్తో పాటు సర్కిల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గురుపౌర్ణమి ఉత్సవాలకు మర్పల్లి సాయిబాబా ఆలయం ముస్తాబు

**- ఈ నెల 29న ప్రత్యేక పూజలు, హారతులు, అభిషేకాలు, అన్నదానం**

**- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సేవా సమితి పిలుపు**

మర్పల్లి, జూలై 26 (విజన్ ఆంధ్ర) వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని సద్గురు షిర్డి సాయిబాబా దేవాలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలను ఈ నెల 29వ తేదీ బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు శ్రీ షిర్డి సాయిబాబా సేవా సమితి సభ్యులు తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఆశాఢ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఉదయం 5.15 గంటలకు ధ్వజారోహణం, కాకడ హారతితో ఉత్సవాలు ప్రారంభం కానుండగా, ఉదయం 7.30 గంటలకు శ్రీ షిర్డి సాయిబాబాకు మంగళస్నానం, శ్రీ రామలింగేశ్వర స్వామికి మహాభిషేకం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.15 గంటలకు మధ్యాహ్న హారతి అనంతరం తీర్థప్రసాదం, మహా అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. సాయంత్రం 6.15 గంటలకు ధూప హారతి, రాత్రి 7.30 గంటలకు శేజ హారతి నిర్వహించి, అనంతరం భజన కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సాయినాథుని ఏకాదశ సూత్రాలను భక్తులకు వివరిస్తూ, గురుపౌర్ణమి రోజున సాయిబాబా పాద దర్శనం చేసుకోవడం విశేష పుణ్యఫలాన్ని అందిస్తుందని సేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. భక్తులు తమలోని అజ్ఞానాన్ని తొలగించుకొని, ఆధ్యాత్మిక చింతనతో గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొని సాయినాథుని కృపాకటాక్షాలు పొందాలని కోరారు. "అన్నదానమే నారాయణ సేవ" అనే భావనతో నిర్వహించే మహా అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొని తమ వంతు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి మర్పల్లి పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరై సద్గురు షిర్డి సాయిబాబా వారి ఆశీస్సులు పొందాలని శ్రీ షిర్డి సాయిబాబా సేవా సమితి, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు.

# బాధిత కుటుంబానికి సగర సంఘం రూ" 11,000/- చేయూత



మెదక్ /రేగోడ్ జూలై 27(విజన్ ఆంధ్ర ): కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఇబ్బందికర పరిస్థితిలో ఉన్న బాధిత కుటుంబానికి రేగోడ్ మండల సగర సంఘం అండగా నిలిచింది. మండలం లోని కొత్వాన్ పల్లిలో ఉప్పరి నర్సింలు మృతి చెందగా వారి కుటుంబానికి మెదక్ జిల్లా సగర సంఘం అధ్యక్షుడు సందిల సాయిలు ఆధ్వర్యంలో రేగోడ్ మండల సగర సంఘం సభ్యులు రూ. 11,000/- వేలను ఆదివారం అందజేశారు. వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని అందించి సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయిలు సాగర్, ఉపాధ్యక్షుడు శివ కుమార్ సాగర్, ప్రధాన కార్యదర్శి రాజు సాగర్, కోశాధికారి అంజన్న సాగర్, జనరల్ సెక్రెటరీ మోహన్ సగర్, రాములు సగర, గ్రామ అధ్యక్షులు పెద్ద రాములు చిన్న రాములు, సాయిలు సగర పాల్గొన్నారు.

# అనుమానిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలి

**లిబాల్య విహావాలు చేయడం నేరం - ఎస్సై పోచయ్య**

మెదక్ /రేగోడ్ జూలై 27(విజన్ ఆంధ్ర ): మెదక్ ఎస్పీ డి. శ్రీనివాసరావు ఆదేశాలతో రేగోడు మండల పరిధిలోని గజ్వా వాడ గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామ ప్రజలకు రేగోడు పోలీస్ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రజలు తగు జాగ్రత్త తీసుకోవాలి, ముఖ్యంగా మహిళలు వ్యవసాయ భూముల నుండి వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు కానీ బంగారు ఆభరణాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి గుర్తుతెలియని వ్యక్తులు పలకరించినచోట నమ్మి మోసపోకూడదు, 18 సంవత్సరాలు నిండని మహిళలను చిన్నారులను వివాహాలు నేరం అని అవగాహన కలిపించారు. వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయబడతాయి మద్యం సేవించి వాహనం నడిపి పోలీస్ వారి తనిఖీల్లో పట్టుబడితే జరిమానా మద్యం సేవించి రెండవసారి పట్టుబడితే జరిమానాతో పాటు న్యాయస్థానం జైలు పంపే అవకాశం కూడా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోండి గ్రామాల్లో మూఢనమ్మకాలు కూడా నమ్మకూడదని తెలియజేయడం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు వాట్సప్ లో లింకులు పంపి హాయ్ అని మీరు స్పందించకూడదు బ్యాంకు ఉద్యోగులమని గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి ఓటీపీలు చెప్పకూడదు బ్యాంకు పనులు ఉంటే బ్యాంకుకు వెళ్లి ఖాతా వివరాలు తెలుసుకోవాలని గ్రామ ప్రజలకు క్లుప్తంగా వివరించారు.



## అల్లాపూర్‌లో ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు

### -ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూలై 27 (విజన్ ఆంధ్ర ప్రతినిధి) : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం అల్లాపూర్ డివిజన్‌లో పర్యటించి సర్వే నంబర్ 18లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి కేటీఆర్ సహకారంతో సుమారు నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలు మరియు కమ్యూనిటీ హాల్ నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ సహకారంతో రూ.50 లక్షల వ్యయంతో ప్రహరీ గోడ నిర్మాణానికి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొంతమంది కాంగ్రెస్ నాయకులు కోట్ల రూపాయల విలువైన ఈ ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కలెక్టర్ సహకారంతో ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ పనులు చేపట్టామని, త్వరితగతిన పాఠశాల నిర్మాణానికి అవసరమైన బడ్జెట్‌ను కేటాయించి ప్రజలకు ఉపయోగపడే విద్యాసంస్థలను నిర్మించాలని అధికారులను కోరారు. ప్రభుత్వం సహకరించకపోతే భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పాఠశాల భవనాలను నిర్మిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములపై జరుగుతున్న కబ్జాల విషయమై హైడ్రా, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా చెరువుల అభివృద్ధికి సహకరిస్తున్న హైడ్రా కమిషనర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను స్వాగతిస్తామని, అయితే ప్రజలకు ఇబ్బందులు కలిగించే చర్యలను మాత్రం సహించబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సభియా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, లింగాల ఐలయ్య, పిల్లి తిరుపతి, ఎన్. సత్యం, వీరారెడ్డి, బాబా, జ్ఞానేశ్వర్, జగన్, శ్రీనివాస్ రెడ్డి, శ్యామ్‌సుందర్ రెడ్డి, మల్లికార్జున్, రమేష్, హమీద్, రామ్‌రెడ్డి, రాజు, సంజీవ్, జిలాని, నూర్ ఖాన్, మోయిజ్, రియాజ్ తదితర నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర అదనపు సీఈఓ కీలక ఆదేశాలు

-తప్పులేని, పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే ప్రధాన లక్ష్యం
-డూప్లికేట్, నకిలీ, మరణించిన ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి
-చిరునామా మార్పులు, అందుబాటులో లేని ఓటర్లను క్షేత్రస్థాయిలో ధృవీకరించాలి
-80 ఏళ్లు పైబడిన ఓటర్ల ప్రొజెనీ మ్యాపింగ్ వేగవంతం చేయాలని ఆదేశం
-వీవీఐపీ ఓటర్ల వివరాలు, డేటా డిజిటైజేషన్ పురోగతిపై సమీక్ష
-అవకతవకలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

కుత్బుల్లాపూర్, జులై 27 (విజన్ ఆంధ్ర); తెలంగాణ రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన సహాయ ఎన్నికల నమోదు అధికారులతో (ఏఈఆర్వోలు) సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఓటరు జాబితా శుద్ధీకరణ, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా సమీక్షించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అందుబాటులో లేని ఓటర్లు, నివాసం లేదా చిరునామా మార్చుకున్న వారు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్, నకిలీ ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించి ఖచ్చితమైన ధృవీకరణ చేపట్టాలని అదనపు సీఈఓ ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి నమోదును అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు./అదేవిధంగా 80 సంవత్సరాలు పైబడిన ఓటర్ల ప్రొజెనీ మ్యాపింగ్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన అన్ని పనులను భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాల మేరకు వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాలోని వీవీఐపీ ఓటర్ల వివరాలు, ఎన్యూమరేషన్ ఫారాల డేటా డిజిటైజేషన్ పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. ప్రతి నమోదు ఖచ్చితత్వంతో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ఒకే ఇంటి వద్ద అధిక సంఖ్యలో నమోదైన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని సూచించారు. ఎలాంటి తప్పుడు నమోదు చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. "స్వచ్ఛమైన, పారదర్శకమైన, తప్పులేని ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం ప్రధాన లక్ష్యం. ప్రతి అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలి. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అవకతవకలు జరిగినా సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో ఏఈఆర్వోలు శంకర్ సింగ్, వెంకట్రాములు, స్పందన, రాజేష్, వాణిరెడ్డి, ప్రమీల, ఉదయ్ కుమార్, వేణు, రమేష్, పవన్ కుమార్, ప్రవీణ్ కుమార్, నర్సింగ్ రావు, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

## చదువుపైనే నమ్మకం

– ఆరుట్ల యువకుడు 5 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి రికార్డు
– గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి కష్టంతో క్లర్క్ నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ వరకు... – రంగారెడ్డి జిల్లాకు గర్వకారణం..

మంచాల్,ఆరుట్ల,జూలై 26, (విజన్ ఆంధ్ర): "చదువును నమ్ముకున్న వాడు ఎప్పటికీ మోసపోడు" అనే మాటను అక్షరాలా నిజం చేసి చూపించాడు రంగారెడ్డి జిల్లా మంచాల్ మండలం ఆరుట్ల గ్రామానికి చెందిన చిందం అంజన్ కుమార్... తండ్రి కృష్ణ కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషించినా చదువును మాత్రం వదలేదు అంజన్. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినా పట్టుదలను ఆయుధంగా మార్చుకున్నాడు. వివిధ కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటూ నిరంతరం కష్టపడిన ఫలితంగా ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి యావత్ జిల్లాకు ఆదర్శంగా నిలిచాడు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లో క్లర్క్ గా, హైకోర్టులో ఫీల్డ్ అసిస్టెంట్ గా, రైల్వే చీూజ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ లెవెల్స్ లో, అలాగే ు+ూ=జ లో డిప్యూటీ సూపరింటెండెంట్ గా ఎంపికయ్యాడు. ఒకేసారి ఐదు ఉద్యోగాలు రావడంతో ఆరుట్ల గ్రామంతో పాటు మంచాల్ మండలం మొత్తం అంజన్ పేరు మారుమోగుతోంది. పెద్ద సపోర్ట్ లేకుండా స్వయంకృషితో ఈ స్థాయికి చేరుకున్న అంజన్ విజయం పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గ్రామీణ యువతకు దిక్సూచిలా నిలిచింది."పట్టుదల ఉంటే గ్రామం నుంచి కూడా ఏదైనా సాధించవచ్చు" అని అంజన్ చెబుతున్న మాటలు ఇప్పుడు యువతలో స్ఫూర్తి నింపుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు, స్థానిక నాయకులు, మిత్రులు అంజన్ కుమార్ ను, ఆయన తండ్రి కృష్ణ ను ఘనంగా అభినందించారు.

## విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని నార్కెట్ పల్లి మహాధర్నా

**విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9, ఆర్ఆర్ యాక్ట్ ను రద్దు చేయాలి**

**ప్రభుత్వ నాయకులు కమిషన్లు రావనే విద్యార్థుల స్కాలర్షిప్లు ఇవ్వట్లేదు**

నార్కెట్ పల్లి : విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాక్ట్ రద్దు చేయాలని వేల మంది విద్యార్థులతో నార్కెట్ పల్లి లో మహా ధర్నా విద్యార్థి నాయకులకు పోలీసులకు తోపులాట ఏకధాటిగా విద్యార్థులపై దాడి చేసిన పోలీసులు బస్సుల పైకెక్కి నినాదాలు చేసిన విద్యార్థి నాయకులు తదినంతరం శాంతియుతంగా ధర్నా ముగించారు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, ఆధ్వర్యంలో జరిగిన ధర్నా బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్, బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, టిఆర్ఎస్ నాయకులు అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు

నార్కెట్ పల్లి లో మహాధర్నా రాస్తారోకో చేశారు విద్యార్థులు వారు మాట్లాడుతూ విద్యార్థులకు రావలసిన 10 వేలకోట్ల స్కాలర్షిప్ ఫీజు బకాయిలు ఇవ్వకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తుంది ఈ ప్రభుత్వం, విద్యార్థులకు వ్యతిరేకంగా తెచ్చిన జీవో నెంబర్ 9ను ఆర్ఆర్ యాత్రను రద్దు చేయాలన్నారు విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి, పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించాలి విద్యాశాఖ మంత్రిని నియమించి వెంటనే విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి,, వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి గాంధీ విగ్రహాలు పెట్టడానికమూసి సుందరీకరణ ఫోర్త్ సిటీకి లక్షల కోట్లు ఉంటాయి గాని విద్యార్థులకు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు ఉండయా, ప్రభుత్వం స్కాలర్షిప్లు ఇవ్వక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు కాలేజ్ యజమాన్యాలు ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను వేధిస్తున్న ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చెలమతనం లేదు రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యలను పూర్తిగా విస్మరించింది అన్నారు ఇంజనీరింగ్ ఎంబీఏ ఎంసీఏ చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు ప్రభుత్వమే భరించాలి సంక్షేమ హాస్టల్లకు సొంతభవనాలు నిర్మించాలి అప్లై చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇవ్వాలి మెస్ చార్జీలు పెంచాలి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో పెట్టిన విద్యార్థులకు 5 లక్షల లక్షల భరోసా కార్డు ఇవ్వాలి 100రోజుల్లోనే విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక విద్యార్థుల చావులపై పేలాలు ఏరుకుంటుంది ప్రభుత్వం 100 రోజుల్లో రాజీవ్ గాంధీ ఇంద్రగాంధీ విగ్రహాలు తప్ప రాష్ట్రంలో ఎలాంటి మార్పు లేదు హాస్టలకు సొంత భవనాలులేవు ఉన్న అద్దె కొంపలకు బెచ్చులూడి విద్యార్థులు చనిపోయే ప్రమాదం ఉన్న ఈ ప్రభుత్వం నిమ్మకు నీరు ఎత్తినట్లుగా వ్యవహరిస్తుంది ఆర్ కృష్ణన్న కొట్లాడి విద్యార్థుల కోసం పూర్తి ఫీజులను ప్రభుత్వమే భరించే విధంగా పెట్టిస్తే ఆ జీవోను తుంగలోకి తొక్కి ఈ



ప్రభుత్వం ట్రస్ట్ బ్యాంక్ పెడతామని బెదిరిస్తుంది ఇక ఊరుకునే ప్రసక్తే లేదు ఈ ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలి పెంచిన ఫీజులన్నీ ప్రభుత్వమే భరించాలి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలి విద్యారంగానికి నిధులు కేటాయించాలని లేనియెడల పెద్ద ఎత్తున వీూ ఆర్ కృష్ణన్ ఆధ్వర్యంలో ధర్నాలు రాస్తారోకోలు బస్సులు దానాలు చేసి ప్రభుత్వని అట్టుడికిస్తామని హెచ్చరిస్తున్నాం ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కంబాలపల్లి సతీష్ బిజెపి కార్యవర్గ సభ్యులు పల్లపు దుర్గయ్య, పాలకూరి రమేష్, డెక్కంటి గణేష్ చిలువేరు సిలువేరు నాగరాజు, పి సర్వయ్య గౌడ్,కారంపూడి సాయి, తేజ, మహేష్, బీసీ సంఘం నాయకులు ఎడ్ల మహాలింగం, జినుకల కృష్ణ,బిఆర్ఎస్ నాయకులు సురేష్, మనీష్, అనిత, లింగస్వామి, వినయ్, వెంకట్, భాస్కర్, రమాదేవి, ఉషశ్రీ, ఉదయ్ శ్రీ, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

**- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్**



నిజామాబాద్ జులై27: (విజన్ ఆంధ్ర) నిజామాబాద్ నగరంలోని పలు రోడ్లు, వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ కోరారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని సోమవారం హైదరాబాదులోని సచివాలయంలో కలిసి ప్రతిపాదనలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్, నాందేవాడ వంతెన ( ఆర్ వో బీ) పొడిగింపు ( అదనపు పనులు) చేయాలని కోరడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ రైల్వే లైను దాటడానికి విజయ థియేటర్ మరియు నాందేవాడ వంతెన వద్ద కేవలం రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయ ని ఈ నేపథ్యంలో సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మ గుట్ట వద్ద మరొక రైల్వే రన్వే ఏర్పాటు చేయడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రూ.170 కోట్లు మంజూరుకావాలన్నారు. అలాగే నిజామాబాదులోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి పాత జిపి ఆఫీస్ వరకు రూ.30 కోట్లతో ఆర్ అండ్ బీ రోడ్డు కోసం ప్రతిపాదించడం జరిగింది. అలాగే వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ మీదుగా కమ్మర్పల్లి వరకు 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను అందజేయడం జరిగింది.

# ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.పి జిల్లా సదస్సు...

ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,జూలై 27 (విజన్ ఆంధ్ర) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి అనుబంధ సంఘాల జిల్లా సదస్సు వైభవంగా జరిగింది. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంస్థల నూతన నిర్మాణంలో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సుకు జిల్లా ఇంచార్జిలు ఆడెపు నాగార్జున మాదిగ, మద్దిలేటి మాదిగ అధ్యక్షత వహించారు.

గ్రామ స్థాయి నుంచి బలోపేతం

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి సంస్థను మరింత బలోపేతం చేయాలి. యువతను ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలి. మాదిగల హక్కుల సాధన కోసం అందరం ఐక్యంగా పోరాడాలిబి అని పిలుపునిచ్చారు.

త్వరలోనే గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీల నిర్మాణం పూర్తి చేసి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

**- గ్రామ స్థాయి నుంచి ఉద్యమ బలోపేతానికి పిలుపు..**

**- మందకృష్ణ మాదిగ ఆదేశాలతో నూతన కమిటీల నిర్మాణం..**

**- యువతను ఉద్యమంలోకి ఆహ్వానం...**

ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గుడిగానిపల్లి రాజు మాదిగ, ఎం ఎస్ పి పార్టీ జిల్లా అధ్యక్షులు కరిగేళ్ల దశరతం మాదిగ, వీ=రూ జిల్లా ఉపాధ్యక్షులు అడెల్లి అంజి మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దులు మాదిగ, కల్వకుర్తి మండల ఇంచార్జి పర్వపాకుల శేఖర్ మాదిగలి తో పాటు జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలాగే కళామండలి జిల్లా కార్యదర్శి బొల్లె జగన్, మాజీ కౌన్సిలర్ చిన్న, గూట విజయ్ మాదిగ, పరమేష్ మాదిగ, రాముడు మాదిగ, కుర్మయ్య మాదిగ, చంటి మాదిగ, భగవంత్ మాదిగ, బాలన్న మాదిగ, రాధాకృష్ణ మాదిగ, నాగన్న మాదిగ తదితర సీనియర్ నాయకులు హాజరై ఉద్యమానికి మద్దతు తెలిపారు...

# దళిత సమస్యల పరిష్కారానికి ఆగస్టు 3న కలెక్టరేట్ ముట్టడి

**డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం**

బెల్లంపల్లి, జూలై 27 విజన్ ఆంధ్ర : దళితులు, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 3న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని డీహెచ్‌పీఎస్ (దళిత హక్కుల పోరాట సమితి) నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం బెల్లంపల్లిలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, బడుగు, బలహీన వర్గాలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. భూమిలేని నిరుపేదలకు సాగుభూములు పంపిణీ చేయాలని, అసైన్డ్ భూములకు పూర్తి హక్కులు కల్పించాలని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అలాగే నిరుపేదలకు ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయడం, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించడం, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించడం, గ్రామాల్లో బెల్ట్ షాపులను నియంత్రించడం, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడం, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయడం, ఎస్సీల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం, ఇండస్ట్రియల్ రుణాల సబ్సిడీలు విడుదల చేయడం, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి పీఎఫ్ బకాయిలను వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లం తిలక్ అంబేద్కర్, జిల్లా నాయకులు దాసరి శ్రీధర్, లింగాల వెంకటేశ్వర్లు, దెబ్బేట ప్రసాదరావు, దేవికిరణ్ లాల్, ఆర్.జి. రాజేందర్, దాసరి సంపత్, సదాలక్ష్మి, రేణుక, దివ్య, జయమ్మ, యశోద తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో నిజామాబాద్ రూరల్ రాష్ట్రానికే ఆదర్శం

**- ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి**

**- దొంగ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి..**

**- బీజేపీ ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తోంది**

**- ఎంపీ అరవింద్ నోరు అదుపులో పెట్టుకోవాలి**

**- అనుచిత వ్యాఖ్యలు చేస్తే అంతే దీటుగా సమాధానం ఇస్తాం**

**- సర్ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్ ప్రక్రియలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యుత్తమ పనితీరు కనబరిచిందని, ఈ విజయానికి బూత్ లెవల్ ఏజెంట్లు (దీూాలు), కాంగ్రెస్ శ్రేణుల కృషియే కారణమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి అన్నారు. సోమవారం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని అమృత్ గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సర్ సమీక్ష సమావేశంలో ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి 293 మంది దీూా ఏజెంట్లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిజామాబాద్ రూరల్‌లో సర్ ప్రక్రియ సమర్థవంతంగా అమలవడంతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా అభినందించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు గర్వకారణమన్నారు. అయితే ప్రక్రియ ఇక్కడితో ముగియలేదని, తుది ఓటరు జాబితా వెలువడే వరకు ఒక్క అర్హ ఓటు కూడా తొలగిపోకుండా ప్రతి దీూా అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

తుది ఓటరు జాబితా విడుదలైన వెంటనే ప్రతి పోలింగ్ బూత్‌లో జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానాస్పద పేర్లు, దొంగ ఓట్లు లేదా అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించిన సందర్భాలు ఉంటే వెంటనే గుర్తించి అభ్యంతరాలు నమోదు చేయాలని సూచించారు.

ఇందుకోసం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్, ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రతి ఫిర్యాదును వేగంగా పరిష్కరించే చర్యలు చేపడతామని వెల్లడించారు.

రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ, బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ సంస్థలను ప్రభావితం చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో చోటుచేసుకున్న ఓటర్ల జాబితా వివాదాల మాదిరిగా తెలంగాణలో కూడా ఓట్ల గల్లంతు జరగకుండా కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.

విద్యార్థుల అంశంపై మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల పట్ల అమానుషంగా వ్యవహరించిందని, ఆ వైఖరికి దేశవ్యాప్తంగా గట్టి గుణపాఠం లభించిందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విద్యార్థుల గొంతుకగా నిలబడి వారి సమస్యలపై పోరాడారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు దేశ ప్రజలు ఏకమై నిలబడటంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యాఖ్యానించారు.

ఓటు హక్కు చరిత్రను ప్రస్తావిస్తూ, దేశంలో ఓటు హక్కును ప్రజలకు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు ఓటు హక్కు అర్హత వయస్సును తగ్గించిన చారిత్రక నిర్ణయం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తీసుకున్నారని గుర్తుచేశారు.

యువతకు రాజకీయాల్లో మరింత అవకాశాలు కల్పించేందుకు భవిష్యత్తులో శాసనసభలకు పోటీ చేసే అర్హత వయస్సును 21 ఏళ్లకు తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేయాలని భావిస్తోందని, ఆ నిర్ణయానికి నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం సంపూర్ణ మద్దతు ఇస్తుందని సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కరతాళధ్వనులతో తమ మద్దతు తెలిపారు.

అభివృద్ధి అంశాలపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు అమలై ఉంటే నేడు ఉత్తర తెలంగాణ కరువు సమస్యను ఎదుర్కొనే పరిస్థితి ఉండేదే కాదన్నారు. కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్టుల్లో భారీ అవినీతి జరిగిందని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. మంచిప్ప 21 ప్యాకేజీ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.1,300 కోట్ల నుంచి రూ.3,000 కోట్లకు పెంచి వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని విమర్శించారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్టును పునఃప్రారంభించి, కాలువల ద్వారా తక్కువ వ్యయంతో ఎక్కువ సాగునీరు అందించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

రాబోయే రెండున్నరేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు శాశ్వత సాగునీటి పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే లక్ష్యంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పనిచేస్తున్నాయని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలకు పాల్పడకుండా బీజేపీ నాయకులు తమ భాషను అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్‌పై అసత్య ప్రచారాలు చేస్తే ప్రజాస్వామ్యబద్ధంగా గట్టి సమాధానం ఇస్తామని స్పష్టం చేశారు. ఎంపీ అరవింద్ మాటలు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు.

ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నియోజకవర్గ ాx= సమన్వయకర్త ఆకుల లలిత, రాష్ట్ర గీతా పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఐసీడీఎంఎస్ చైర్మన్ మునిపల్లి సాయరెడ్డి, తారాచంద్ నాయక్, భాస్కర్ రెడ్డి, మండల అధ్యక్షులు అంబర్ సింగ్, సర్పంచ్ ఫోరం నియోజకవర్గ అధ్యక్షులు వాసు, అమృతాపూర్ గంగాధర్, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఖానాపూర్ కాలువలో అపరిచిత వ్యక్తి మృతదేహం!



**- చేతిపై టాటూ ఆచూకీకి కీలకం.**

**- కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు**

గండిపేట, జూలై 27 (విజన్ ఆంధ్ర): నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో ఉన్న కాలువలో సోమవారం ఒక అపరిచిత వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం... జులై 27న విధులు నిర్వహిస్తున్న పెట్రోలింగ్ సిబ్బందికి డయల్-100 ద్వారా ఖానాపూర్ వద్ద కాలువలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

మృతుడి వయస్సు దాదాపు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని అధికారులు తెలిపారు. మృతదేహంపై నల్లటి టీ-షర్ట్, తెల్లటి నిక్కరు ఉన్నాయి. బాధితుడి ఎడమ చేతిపై ఒక టాటూ (పచ్చబొట్టు) ఉందని, ఇది అతని గుర్తింపును కనుగొనడంలో కీలక ఆధారమయ్యే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

ఘటనపై కేసు నమోదు చేసుకున్న నార్సింగి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని తదుపరి గుర్తింపు మరియు భద్రపరచడం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

పోలీసుల విజ్ఞప్తి:

మృతుడి ఆచూకీ లేదా అతని వివరాల గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే నార్సింగి పోలీస్ స్టేషన్‌లోగానీ, లేదా డయల్ 100 / 112 నంబర్లకు గానీ సమాచారం అందించాలని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని నార్సింగి ఎస్ హెచ్‌వో కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

## మిడ్జిల్ మండలంలో ఎస్ఐఆర్ ఎనిమరేషన్ ఫారాలు వెంటనే పూర్తి చేయండి

**- ఎనిమరేషన్ ఫారాలు పూర్తి చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని గ్రామ ప్రజలకు అవగాహన**

**- మిడ్జిల్ గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్**

మిడ్జిల్,జూలై 27, విజన్ ఆంధ్ర :మిడ్జిల్ మండల కేంద్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, ఇంకా ఎనిమరేషన్ ఫారాలు పూర్తి చేయని అర్హులైన ఓటర్లు వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాలని గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్ , జీపీఓ కొండయ్య , కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బండి నరసింహ, బీఎల్ఏలు గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎనిమరేషన్ ఫారాలు పూర్తి చేయని పక్షంలో ఓటరు జాబితాలో పేరు నమోదులో ఇబ్బందులు తలెత్తి, ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని వారు తెలిపారు. అందువల్ల గ్రామంలోని ప్రతి అర్హులైన ఓటరు తమ ఎనిమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా పూర్తి చేసి సంబంధిత బీఎల్ఏ, బీఎల్ఓ లేదా గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని వారు పిలుపునిచ్చారు.

## మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన ప్రజా సంఘాల నాయకులు



అయిజ జూలై 27 విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్ లో ఉన్న మాజీ రాష్ట్రపతి, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి ఆయన 11వ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలతో ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు శర్మ డాక్టర్ అబ్దుల్ కలాం గురించి మాట్లాడుతూ కలాం గొప్ప మహోన్నత వ్యక్తి అని, ఆయన ఉపాధ్యాయ వృత్తి నుండి శాస్త్రవేత్త దాక ఎదిగి ఎన్నో పరిశోధనలు చేసి రాకెట్లను ఇతర దేశాల వలె మన భారతదేశాన్ని ప్రపంచంలో గుర్తింపు వచ్చే విధంగా కృషి చేసి భారతదేశానికి చాలా సేవలు చేశాడని అన్నారు.

ఆయన ఆశలను కొనసాగింపు దశగా మనమందరము కృషి చేయాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేటి యువత అబ్దుల్ కలాం వలె ఉన్నత విద్య అభ్యసించి దేశంలో ఉన్నతమైన గుర్తింపు పొందిన పనులు చేసి దేశానికి ఊరికి గర్వకారణంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాల మల్లికార్జున్, బిఆర్ఎస్ నాయకుడు అశ్వ పెద్దయ్య, గోరంట్ల స్వామి దాసు, క్రిస్టఫర్, మాజీ కౌన్సిలర్ మౌల, కనికీడు భాష, తూముకుంట కిష్టన్న, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ భారత్‌లో భాగంగా ఇంకుడు గుంత పనులు ప్రారంభం

**బండమీదిపల్లిలో సర్పంచ్ పాండు చేతుల మీదుగా శంకుస్థాపన**

**- భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యం, సర్పంచ్ పాండు**

**- ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలని పిలుపు**

జడ్చర్ల, జులై 27,(విజన్ ఆంధ్ర): భూగర్భ జలాలను పెంచడంతో పాటు పారిశుధ్య లక్ష్యంతో స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమం గ్రామాల్లో వేగం పుంజుకుంది. జడ్చర్ల మండలం బండమీదిపల్లి గ్రామంలోని డబుల్ బెడ్ రూం ఆవరణలో ఆదివారం ఇంకుడు గుంత తవ్వే పనులను గ్రామ సర్పంచ్ సత్యమొల పాండు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీటిని వృథా చేయకుండా భూమిలోకి ఇంకించడం ద్వారానే భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొర్వి నాగలక్ష్మి మల్లేష్, వార్డు సభ్యులు దొర్వి రమేష్, కొత్తోల్ల చిన్న పెంటయ్య, చిట్యాల సురేష్, చిట్యాల మహేష్ తో పాటు గ్రామస్తులు దొర్వి రవి, మల్జ శివ, చిట్యాల సతీష్, సత్యం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సరఫరా నెట్‌వర్క్‌లపై 'ఈగల్ ఫోర్స్' ఉక్కుపాదం

**- ఏడాదిలో 7 టన్నుల గంజాయి స్వాధీనం**

**- వివరాలు వెల్లడించిన ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్**

నిజామాబాద్ జూలై:( విజన్ ఆంధ్ర ) :గంజాయి సరఫరా నెట్‌వర్క్‌లపై 'ఈగల్ ఫోర్స్' ఉక్కుపాదం మోపిందని ఎస్పీ గిరిధర్ వెల్లడించారు.ఏడాదిలో 7 టన్నుల గంజాయి స్వాధీనం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కమాండో కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

గంజాయి, డ్రగ్స్ విక్రయాలు,అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర 'ఈగల్ ఫోర్స్' (ఙఖ్రశ్రీవ ఖీశీతీషవ) పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు.హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న గంజాయి సరఫరా శృంఖల (ూబజూజూశ్రీఎ జష్ట్రుఱఅ)ను విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలు, పొరుగు రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సంయుక్త ఆపరేషన్లు నిర్వహిస్తోందన్నారు.

ఈ క్రమంలో, గత ఏడాది కాలంలో ఈగల్ ఫోర్స్ వివిధ రాష్ట్రాల సరిహద్దుల్లో ప్రత్యేక దాడులు నిర్వహించి దాదాపు 7 టన్నుల (7,000 కిలోల) గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని స్పష్టం చేశారు.

గంజాయి అక్రమ రవాణాలో పాల్గొంటున్న ముఠాలపై నిఘా పెంచి, కేంద్ర సంస్థలు, ఇతర రాష్ట్రాల చట్ట అమలు సంస్థలతో సమన్వయంగా భారీ సంయుక్త ఆపరేషన్లు నిర్వహిస్తూ సరఫరా నెట్‌వర్క్‌ను



ఛేదించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

కేంద్ర, రాష్ట్ర సంస్థలతో కలిసి ఈగల్ ఫోర్స్ సంయుక్త ఆపరేషన్లు ఈగల్ ఫోర్స్ కేంద్ర దర్యాప్తు సంస్థలైన నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో,డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర రాష్ట్రాల పోలీసులతో సమన్వయంగా పలు కీలక సంయుక్త ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు.

ఈగల్ ఫోర్స్--ఎన్‌సీబీ సంయుక్త ఆపరేషన్‌లో రాంచీలో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

౨ ఒడిశా ఆపరేషన్: ఒడిశాలోని కోరాపుట్ సదర్ పోలీసులతో కలిసి నిర్వహించిన దాడిలో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ఆపరేషన్: రాయ్‌పూర్ సమీపంలోని ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్‌లో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఛత్తీస్‌గఢ్--మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో నిర్వహించిన సంయుక్త దాడిలో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

సరఫరా గొలుసు (ూబజూజూశ్రీఎ జష్ట్రుఱఅ) విచ్ఛిన్నమే ప్రధాన లక్ష్యం గా దాడులు నిర్వహించడం జరిగిందన్నారు.

గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలంటే కేవలం రవాణాదారులపై చర్యలు తీసుకోవడం మాత్రమే కాకుండా, మొత్తం సరఫరా గొలుసును విచ్ఛిన్నం చేయడం అవసరమని ఈగల్ ఫోర్స్ భావిస్తోందని ఎస్పి గిరిధర్ వెల్లడించారు.. అందులో భాగంగా గంజాయి, డ్రగ్స్ వినియోగాన్ని తగ్గించడం ద్వారా వాటిపై డిమాండ్‌ను తగ్గించి, అక్రమ సరఫరాకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో చట్ట అమలు చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోందన్నారు.

ఆల్ప్రాజోలమ్, గంజాయి మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గంజాయి వద్దు ప్రాణాలే ముద్దు అనే నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఈగల్ ఫోర్స్ డిఎస్పి సోమనాథం తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు షాద్‌నగర్ చౌరస్తా విస్తరణకు శ్రీకారం

**- ఆక్రమణల తొలగింపుతో ప్రారంభమైన పనులు..**

**- ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఆశలు**

షాద్‌నగర్, విజన్ ఆంధ్ర ,జూలై 27: ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న షాద్‌నగర్ ప్రధాన చౌరస్తా విస్తరణ పనులు సోమవారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు, వాహనదారులు స్వాగతం పలుకుతున్నారు.షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ఆర్డీవో సరిత, ఏసీపీ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి, తహసీల్దార్ నాగయ్య, సీఐ సీతారాం ఆధ్వర్యంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీసు, ఆర్అండ్‌బీ, విద్యుత్ శాఖల అధికారులు సంయుక్తంగా విస్తరణ పనులను ప్రారంభించారు. పరిగి రోడ్డులోని పోచమ్మ ఆలయం నుంచి జేసీబీల సహాయంతో రహదారికి ఇరువైపులా 50 అడుగుల పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగించే ప్రక్రియ చేపట్టారు.మొదటి దశలో రహదారిని ఆక్రమించి నిర్మించిన తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలను తొలగిస్తున్నారు. పలువురు వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాల ముందున్న ఆక్రమణలను తొలగించుకోగా, మరికొందరు కొంత గడువు ఇవ్వాలని అధికారులను కోరారు. అందరి సహకారంతో పనులను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

**ఏళ్ల తరబడి సాగిన నిరీక్షణ**

షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ ప్రతిపాదన కొత్తది కాదు. జాతీయ రహదారి బైపాస్ ఏర్పడిన నాటి నుంచే ఈ అంశం చర్చకు వచ్చినా, వ్యాపారుల అభ్యంతరాలతో పలుమార్లు నిలిచిపోయింది. గతంలో మాజీ ఎమ్మెల్యేలు కూడా విస్తరణకు ప్రయత్నించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మళ్లీ ప్రతిపాదన ముందుకు వచ్చింది. దాదాపు ఏడాదిన్నర పాటు చర్చలు, సంప్రదింపుల అనంతరం ఇప్పుడు పనులు ప్రారంభమయ్యాయి.

**ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం?**

ఇటీవల చౌరస్తాలో చోటుచేసుకున్న వరుస ప్రమాదాలు, తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులతో ప్రజల్లో విస్తరణపై డిమాండ్ పెరిగింది. దీంతో అధికారులు వేగంగా చర్యలు చేపట్టారు. చౌరస్తా విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గుతాయని వాహనదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈసారి అన్ని శాఖల సమన్వయం, ప్రజల సహకారంతో షాద్‌నగర్ చౌరస్తా విస్తరణ పనులు విజయవంతంగా పూర్తవుతాయని అధికారులు, స్థానికులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## నగదు చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

బోథ్. జూలై 27. (విజన్ ఆంధ్ర) బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంటి తాళం పగులగొట్టి నగదు చోరీ చేసిన నిందితుడిని బోథ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ వి. పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 24వ బోథ్ పట్టణంలోని న్యూ కాలనీలో బాధితురాలు ఇంటికి తాళం వేసి పనికి వెళ్లగా, సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టబడినట్లు గమనించింది. మరుసటి రోజు ఇంట్లోని పెట్టెలో దాచిన రూ.5,000 నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ఈ నెల 26వ తేదీన బోథ్‌లో వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితుడు కృష్ణకాంత్ జాదవ్ (25), ఎo/ శ్రీ రామారావు, వాగ్దారి, నేరడిగొండ మండలం, ప్రస్తుతం బోథ్ అని గుర్తించారు. తనకు కూలీ పనితో వచ్చే ఆదాయం సరిపోక తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బాధితురాలి ఇంటి తాళం పగులగొట్టి రూ.5,000 నగదు చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడని ఎస్ఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి చోరీకి గురైన రూ.5,000 నగదును స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని, ప్రజలు తమ ఇళ్లకు బలమైన తాళాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని బోథ్ ఎస్‌హెచ్‌ఓ వి. పురుషోత్తం సూచించారు.

# ఎల్-నినో ప్రభావం.. రైతులకు అప్రమత్తత సూచనలు

**- చారకొండ రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభం**



చారకొండ,జులై 27(విజన్ ఆంధ్ర)ఎల్-నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షాలు ఆలస్యమయ్యే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ కాలంలో పండే పంటల సాగుపై దృష్టి సారించాలని చారకొండ మండల వ్యవసాయ శాఖ అధికారి తనూజరాజు సూచించారు. ఈ మేరకు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు,ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు చారకొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం విత్తన మేళాను నిర్వహించారు. ఈ విత్తన మేళా ఈ నెల 29వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు.రైతులకు నాణ్యమైన విత్తనాలు,ఎరువులు,సాగు సాంకేతికతపై నిపుణుల సూచనలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మేళాలో బెండ,కాకర, బీరకాయ,కంది,దోసకాయ, సొరకాయ తదితర పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విత్తనాలతో పాటు సాగు సలహాలు పొందాలని కోరారు.

ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని పంట నష్టాలు నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి తనూజరాజు సూచించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బలరాం గౌడ్,ఏఈవోలు మహేశ్వరి, ఎం. జ్యోతి,సంతోషి,ఎస్.జ్యోతి తదితరులు,రైతులు పాల్గొన్నారు.

## అచ్చంపేట సురక్ష పీపుల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం



అచ్చంపేట జూలై 27 (విజన్ ఆంధ్ర ) : చైతన్య చారిటబుల్ ట్రస్ట్ అచ్చంపేట సురక్ష పీపుల్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో అచ్చంపేట నియోజకవర్గం లోని బల్మూరు మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైనది అచ్చంపేట సురక్ష పీపుల్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ఉదయం 8 నుంచి 2 గంటల వరకు నిర్వహించిన వైద్య శిబిరంలో 246 మందికి షుగర్ బీపీ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని వైద్యులు డాక్టర్ చైతన్య తెలిపారు ప్రధానంగా స్త్రీలు 139 మంది పురుషులు మందికి చికిత్సలు నిర్వహించడం జరిగిందన్నారు చాలామందికి నొప్పులతో బాధపడుతున్నామని సమస్యను వైద్య శిబిరంలో గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు పదిహేను చేత మందికి షుగర్ వ్యాధి 6% మందికి రక్తపోటు బిబి మిగతా నాలుగు శాతం మందికి నరాల బలహీనత సమస్యలు తదితర సాధారణ వ్యాధులు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు చాలామంది మత్తుగా అర్థాలు సేవించడం వల్ల వీళ్ల రోగాల బారిన పడుతున్నట్లు గుర్తించామన్నారు అచ్చంపేట శ్రీ చైతన్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రతి మండలంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందని వైద్యులు చైతన్య తెలిపారు పేద ప్రజలు ఈ అవకాశాన్ని సభ్యులను చేసుకోవాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మమ్మ రామచంద్ర రెడ్డి పంచాయతీ కార్యదర్శి అరుణ స్థానికులు వెంకటయ్య బీరయ్య రెడమయ్య తోపాటు సురక్ష హాస్పిటల్స్ సిబ్బంది బాలరాజు దశరథం జ్ఞానేశ్వర్ తిరుపతమ్మ శ్రీజ మంగ తదితరులు పాల్గొన్నారు


# రైతులకు నాణ్యమైన విత్తనాలే అధిక దిగుబడులకు పునాది

**- వెల్‌జర్ల విత్తన మేళాలో రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్**

షాద్‌నగర్, జూలై 27 విజన్ ఆంధ్ర:-- రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని సద్వినియోగం చేసుకుంటేనే అధిక దిగుబడులు సాధించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండలం వెల్‌జర్ల గ్రామ రైతు వేదికలో సోమవారం నిర్వహించిన విత్తన మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మేళాలో ఏర్పాటు చేసిన వివిధ రకాల విత్తనాల స్టాళ్లను పరిశీలించిన సురేంద్ర మోహన్, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలపై ఆరా తీశారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై రైతులకు నాణ్యమైన విత్తనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా రైతులకు చేరవేయడంతో పాటు, పంటలకు అనువైన విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ సేవలు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా వెల్‌జర్ల గ్రామ సర్పంచ్ రాత్లావత్ బాబు నాయక్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు సురేంద్ర మోహన్‌కు శాలువాతో ఘన సత్కారం చేసి స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి, ఏఓ నిశాంత్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి హిమబిందు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, డైరెక్టర్ సురేష్ గౌడ్, వెల్‌జర్ల, కొందన్నగూడ గ్రామాల సర్పంచులు, వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చలు నిర్వహించారు.

## పెద్ది వీరాభిమాని గుండెపోటుతో మృతి



నల్లబెల్లి, జూలై27(విజన్ ఆంధ్ర):నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి వీరాభిమాని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మండలంలోని కొండాయిల్ పల్లి గ్రామ వార్డు సభ్యుడు ఊరటి నరేష్ సోమవారం ఉదయం గుండె పోటుతో మృతిచెందాడు. పెద్ది సుదర్శన్ రెడ్డికి గుండె పోటు వచ్చిందన్న వార్త విని హుటాహుటిన రోహిణి హాస్పిటల్ కు వెళ్లి, పెద్దిని హైదరాబాద్ కు తరలించాక, ఇంటికి చేరుకొని తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఉద్యమ నాయకుడిని ఆ పరిస్థితిలో చూడటం బాధగా ఉందని స్థానిక నాయకులతో చర్చించి బాధ పడ్డాడు.దురదృష్టవశాత్తు సోమవారం ఉదయం గుండె పోటుతో ఆకస్మిక మరణం స్థానికులను కలచివేసింది.